మన క్రాంతి

KR TV

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 సంచిక 162 | మంగళవారం 13 మే 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-

# పాక్ వెనుక చైనా హస్తం స్పష్టమైంది:

## PL-15 మిస్సైల్ దొరకడమే సాక్ష్యం

పాకిస్థాన్ దాడుల వెనుక చైనా పాత్రను భారత త్రివిధ దళాధిపతులు బహిర్గతం చేశారు. చైనా తయారీ PL-15 మిస్సైల్ పాక్ వినియోగించడమే ఆ దేశానికి చైనా మద్దతు ఉన్నదని నిరూపించిందని ఎయిర్ మార్షల్ ఏకే భారతి పేర్కొన్నారు. సోమవారం త్రివిధ దళాధిపతుల ప్రెస్ కాన్ఫరెన్స్‌లో 'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాలపై ఆయన మాట్లాడారు.




# పాక్ ఊసరవెల్లి మాటలు నమ్మవద్దు

## కాల్పుల విరమణపై బలూచ్ రెబల్స్ హెచ్చరిక




ఇస్లామాబాద్/బలోచిస్థాన్: భారత్-పాకిస్తాన్ మధ్య తాజా కాల్పుల విరమణ ఒప్పందంపై పాకిస్థాన్‌లోని వేర్పాటువాద బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ ) తీవ్ర అనుమానాలు వ్యక్తం చేసింది. "పాక్ ఊసరవెల్లి మాటలు నమ్మకండి. శాంతి, విరమణ అంటూ చెప్పే పాకిస్థాన్ మాటలన్నీ మోసం. ఇవన్నీ తాత్కాలిక వ్యూహాలే, అసలైన లక్ష్యం మరోకటి," అంటూ హెచ్చరించింది. భారత్‌కు పరోక్షంగా పాకిస్థాన్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# ఆర్నెళ్లు జైల్లో ఉన్నది సరిపోదా..

## ఇంకా నన్ను కష్టపెడతారా? - ఎమ్మెల్సీ కవిత

- రెచ్చగొడితే మరింత గట్టిగా స్పందిస్తా
- దీనిపై పార్టీ స్పందిస్తుందని ఆశిస్తున్నా
- టైం వచ్చినప్పుడు అన్నీ బయటపెడతా
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు




బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన కామెంట్స్ చేశారు. తనపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, కుట్రలు పన్నుతున్నారని ఆమె ఆరోపించారు. సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు బయటపెడతానని అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన అనంతరం చిట్ చాట్‌లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. 47 నియోజకవర్గాల్లో పర్యటనలు పూర్తి చేశానని.. ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను మాత్రమే తాను చెబుతున్నానని, పరిస్థితుల ఆధారంగానే సామాజిక తెలంగాణ అంశాన్ని ప్రస్తావించానని అన్నారు. పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతున్న సమయంలో తనపై దుష్ప్రచారం చేయడం సరికాదని ఆమె అన్నారు.
నన్ను రెచ్చగొట్టకండి. ఆర్నెళ్లు జైల్లో ఉన్నది చాలదా? ఇంకా నన్ను కష్టపెడతారా?' అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తనను రెచ్చగొడితే మరింత గట్టిగా స్పందిస్తానని హెచ్చరించారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై పార్టీ స్పందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# పద్ధతి మారకపోతే చర్యలు తప్పవు

- అధికారులపై హోంమంత్రి అనిత సీరియస్
- విజయనగరం డీఆర్సీ సమావేశానికి హాజరైన అనిత..
- ఏదో కాకి లెక్కలతో కాగితాల దొంతులుగా మాకిచ్చి వెళ్లిపోతున్నారు..
- ఆ పేపర్లు తర్వాత చెత్త బుట్టలోకి వెళ్లిపోతున్నాయి..




# దేశద్రోహులకు, కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం బయటపడింది..




సంగారెడ్డి జిల్లా జిన్నారం ప్రాంతంలో చోటుచేసుకున్న మత ఘర్షణలో అరెస్టైన బీజేపీ కార్యకర్తను పరామర్శించేందుకు సంగారెడ్డి సెంట్రల్ జైలుకు వచ్చిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "దేశద్రోహులకు, కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్న సంబంధం బయటపడింది," అని ఆయన విమర్శించారు.

# బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటే:

## మంత్రి పొంగులేటి




ఖమ్మం జిల్లా అభివృద్ధిలో తాము చేపట్టిన కార్యక్రమాల గురించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రస్తావిస్తూ, బీజేపీ-బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రమైన విమర్శలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఒకటే. ఒకరు స్క్రిప్ట్ రాస్తే మరొకరు మాట్లాడతారు అని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షం పాత్ర పోషించడంలో తప్పులేదు. కానీ విమర్శలు చేస్తే వాటికి సోయి ఉండాలి.

# సైన్యానికి సెల్యూట్

- ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని దెబ్బ కొట్టాం..
- అణు బ్లాక్‌మెయిల్‌ను భారత్ సహించదు
- భయంతోనే పాక్ ప్రపంచదేశాలను ఆశ్రయించింది
- ఆపరేషన్ సిందూర్‌లో మన బలగాలు ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించాయి.
- భారత సైన్యానికి, సైంటిస్టులకు నా సెల్యూట్
- 3 రోజుల్లో పాక్‌కు ఊహకందని విధంగా దాడి చేశాం
- ఎడారి, కొండలు, ఆకాశంలో పాక్‌ను వదిలిపెట్టలేదు
- యుద్ధరంగంలో ప్రతిసారి పాక్‌ను మట్టి కరిపించాం
- ఇప్పుడు ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌ను ఓడించాం
- అణ్వాయుధాల బ్లాక్ మెయిల్‌ను ఇక సహించేది లేదు
- పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది..
- అదే ఉగ్రవాదం చేతిలో అంతమవుతుంది




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉగ్రవాదంపై భారత్ తీసుకున్న కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. ఇటీవల విజయవంతంగా ముగిసిన ఆపరేషన్ సిందూర్ అనంతరం ఆయన తొలిసారి జాతిని ఉద్దేశించి మాట్లాడారు. భారత సైన్యం ప్రదర్శించిన సాహసానికి, శౌర్యానికి సెల్యూట్ చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. "ఉగ్రవాదులు కలలో కూడా ఊహించలేనంత దారుణంగా భారత్ వారిపై దాడి చేసింది," అని అన్నారు.

"గడిచిన నాలుగు రోజులుగా మన సైన్యం అద్భుతమైన సాహసం చూపించింది. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, నిఘా సంస్థల సామర్థ్యం దేశమంతా చూశాయి. పహల్గాంలో జరిగిన మానవత్వానికి వ్యతిరేకమైన ఉగ్రదాడి దేశ ప్రజల మనసులను కుదిపేసింది. దేశ రక్షణ దళాల ధైర్య సాహసాలు దేశం తలమానికం" అని ప్రధాని పేర్కొన్నారు.

ఉగ్రవాద శిబిరాలపై భారత మిసైళ్లు, డ్రోన్లు నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించాయన్నారు.




# హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసడర్లుగా మారండి

## సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణను అభివృద్ధిలో అగ్రస్థానానికి తీసుకెళ్లే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై, హైదరాబాద్‌ను ప్రపంచానికి ఒక మోడల్ నగరంగా పరిచయం చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నానక్‌రాంగూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ నూతన ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సొనాటా సంస్థ యాజమాన్యం, ఉద్యోగులకు సీఎం శుభాభినందనలు తెలిపారు. అత్యాధునిక ఏఐ సాంకేతికతను వినియోగిస్తూ పర్యావరణ హిత ప్రణాళికలు రూపొందిస్తున్న సంస్థ సేవలను కొనియాడారు.

### జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడుల్లో తెలంగాణకు అగ్రస్థానం

హైదరాబాద్ ఇప్పటికే సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (GCC)కు ప్రధాన కేంద్రంగా ఎదిగిందని సీఎం తెలిపారు. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, విప్రో, HCL టెక్ లాంటి ఐటీ దిగ్గజాలు నగరంలో తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయని, 1 లక్షకుపైగా ఉద్యోగాలు సృష్టించామని తెలిపారు. దావోస్ వేదికపై 2025 నాటికి రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు రాబట్టగలిగామని వెల్లడించారు. పోలీసింగ్, శాంతిభద్రతలు, ద్రవ్యోల్బణ నియంత్రణ, ఉద్యోగావకాశాల కల్పన, పన్నుల వసూళ్ల పరంగా తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు.

## నేటి మాట

ఏ కారణం లేకుండా
నిన్ను ఇతరులు విమర్శిస్తున్నారంటే
నీవు చేస్తున్న పనిలో విజయం
సాధించబోతున్నావన్న మాట
ఆకారణంగా ఎదురయ్యే విమర్శ
విజయానికి నాంది



- బిఆర్ అంబేడ్కర్

# ఇప్పటికైనా మించిపోయిందేం లేదు ..

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ సూచన




కాంగ్రెస్ ప్రభుత్వం , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు. అందాల పోటీల్లో ముఖ్యమంత్రి మునిగితేలుతుంటే.. మరోవైపు వడదెబ్బకు తాళలేక ధాన్యం కుప్పలపైనే ఓ అన్నదాత బలికావడం అత్యంత బాధాకరమని అన్నారు. రేవంత్ చేతకానితనం వల్ల సీఎం సొంత జిల్లా పాలమూరులోని పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామంలో గుగులోతు కిషన్ (51) అనే రైతు నిండుప్రాణం గాలిలో కలిసిపోయిందని తెలిపారు. ఇది ముమ్మాటికీ ముఖ్యమంత్రి చేసిన హత్యే అని కీలక వ్యాఖ్యలు చేశారు. పెట్టుబడి సాయం ఎగ్గొట్టినా, రుణమాఫీ పేరిట మోసం చేసినా ఆరుగాలం కష్టించి పండించిన పంటను చివరికి కొనే దిక్కు కూడా లేకపోవడంతో.. తెలంగాణ రైతన్న అనాథలా మారాడని అని కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

# కొట్లాడితే ధీరుడితోనే కొట్లాడుతా..

## రండలతో ఏం కొట్లాడను : ఈటల రాజేందర్ కౌంటర్




సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే.. నడిరోడ్డుపై బట్టలిప్పి గుంజీలు తీయిస్తానని ఈటల రాజేందర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు మాటల యుద్ధానికి దారి తీస్తున్నాయి. ఈ క్రమంలోనే జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాస్ కౌంటర్ ఇచ్చారు




# విద్యుత్ చార్జీలు పెంచబోము

- అందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది
- తప్పు చేసిన వారికి రెడ్ బుక్ వర్తిస్తుంది
- ఏపీ విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం

## హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసడర్లుగా మారండి: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

సామాజిక సమానత్వానికి తెలంగాణ దారి

హైదరాబాద్ ట్రాఫిక్ ఫోర్స్‌లో ట్రాన్స్‌జెండర్స్, స్వచ్ఛంద సేవకుల నియామకం చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్రం మరో ముందడుగు వేసిందన్నారు. మహిళా సాధికారత కోసం 66 లక్షలమందికి స్వయం సహాయక బృందాల మద్దతుతో పాటు, యువతకు 'రాజీవ్ యువ వికాసం' ద్వారా స్వయం ఉపాధికి అవసరమైన నిధులు అందిస్తున్నట్లు చెప్పారు.

భవిష్యత్ ప్రణాళికలు –ం మిస్ వరల్డ్, డ్రై పోర్ట్, AI సిటీ

హైదరాబాద్ మిస్ వరల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని సీఎం తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని గ్లోబల్ ఈవెంట్లను రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. డ్రై పోర్ట్ నిర్మాణం, ఏపీ సముద్ర ఓడరేవుతో అనుసంధానం, AI సిటీ, యువత కోసం స్పోర్ట్స్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని వివరించారు.

"తెలంగాణ రైజింగ్"తో సమగ్ర అభివృద్ధి

"తెలంగాణ రైజింగ్" కార్యాచరణ ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగావకాశాలు, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని సీఎం పేర్కొన్నారు. "ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ప్రతి ఒక్కరు తమ పాత్ర పోషించాలి. హైదరాబాద్‌ను ప్రపంచానికి చెరగని గుర్తుగా నిలబెట్టాలంటే, మన విజయాల్ని ప్రపంచానికి చూపించే 'బ్రాండ్ అంబాసడర్లుగా' మీరు మారాలి," అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## దేశద్రోహులకు, కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం బయటపడింది..

సంగారెడ్డి జిల్లా జిన్నారం ప్రాంతంలో చోటుచేసుకున్న మత ఘర్షణలో అరెస్టైన బీజేపీ కార్యకర్తను పరామర్శించేందుకు సంగారెడ్డి సెంట్రల్ జైలుకు వచ్చిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "దేశద్రోహులకు, కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్న సంబంధం బయటపడింది," అని ఆయన విమర్శించారు.
ఈ సంఘటనపై నాలుగుసార్లు విచారణ జరిపించాలని కోరినా, అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదని ఎంపీ అన్నారు. జిన్నారంలోని మదర్సాల్లో విద్యా బోధన కోసం ఎవరిని, ఎక్కడి నుంచి తీసుకువచ్చారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. ఈ అంశంపై పూర్తి స్థాయి వివరణ లేకపోతే హిందూ సంఘాలతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగతామని హెచ్చరించారు.
"కేంద్ర హోంశాఖ దేశద్రోహులను వెంటనే పంపించాలని ఆదేశించినా, రాష్ట్ర అధికార యంత్రాంగం ఇప్పటివరకు స్పందించకపోవడం ఆందోళనకరం," అని రఘునందన్ రావు పేర్కొన్నారు. జిన్నారం మదర్సాపై జిల్లా ఎస్పీ సరిగా స్పందించకపోతే డీవోపీటీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.
"మీరు దేశద్రోహులకు మద్దతు ఇస్తున్నారా?" అని అధికారులను ప్రశ్నించిన ఎంపీ, ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు

## పాక్ వెనుక చైనా హస్తం స్పష్టమైంది: PL-15 మిస్సైల్ దొరకడమే సాక్ష్యం

పాకిస్థాన్ దాడుల వెనుక చైనా పాత్రను భారత త్రివిధ దళాధిపతులు బహిర్గతం చేశారు. చైనా తయారీ PL-15 మిస్సైల్ పాక్ వినియోగించడమే ఆ దేశానికి చైనా మద్దతు ఉన్నదని నిరూపించిందని ఎయిర్ మార్షల్ ఏకే భారతి పేర్కొన్నారు. సోమవారం త్రివిధ దళాధిపతుల ప్రెస్ కాన్ఫరెన్స్‌లో 'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాలపై ఆయన మాట్లాడారు.
ఆపరేషన్ సిందూర్ విజయవంతం
మే 7న భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా చేసుకున్నామని, పౌరులకు ఏ విధమైన హాని కలగకుండా దాడులు చేశామని వెల్లడించారు. కానీ, ప్రత్యుత్తరంగా పాకిస్థాన్ తమ సైన్యంతో బార్డర్‌లో పౌరులపై దాడులకు పాల్పడిందని ధ్వజమెత్తారు.

పాకిస్థాన్ ఉగ్రవాదుల్ని నిలబెట్టేందుకు ప్రయత్నించిందని, దేశ రక్షణ కోసం భారత బలగాలు మాత్రమే కాకుండా దేశీయంగా అభివృద్ధి చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూడా అద్భుతంగా స్పందించాయని చెప్పారు. PL-15 మిస్సైళ్లతో పాటు పాక్ వినియోగించిన వివిధ డ్రోన్లు, మిస్సైళ్లను భారత్ నిర్మించిన ఆకాశ్ క్షిపణులు సమర్థంగా అడ్డుకున్నాయని వివరించారు.
చైనా మద్దతుతో పాక్ కుట్రలు
"చైనా తయారు చేసిన ఆయుధాలను పాక్ వినియోగించిందంటే, ఇది అంతర్జాతీయ భద్రతకు ప్రమాద సూచిక. పాక్ టెర్రరిస్టులకు మాత్రమే కాదు, చైనా సహకారానికి సంబంధించి కూడా స్పష్టమైన మద్దతు అందిస్తోంది," అని ఎయిర్ మార్షల్ తెలిపారు.
భారత్‌కు పరిపూర్ణ రక్షణ సిద్ధత
భారత సైనిక స్థావరాలపై దాడి చేయడం పాక్‌కు అసాధ్యం అని స్పష్టం చేశారు. అత్యాధునిక రాడార్ వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, నిఘా విమానాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉన్నాయని వెల్లడించారు. నౌకాదళం, బీఎస్ఎఫ్ సైతం తగిన భద్రతా చర్యలు చేపట్టాయని వివరించారు.
ప్రధాని ఆదేశం: ఊహించని ప్రతీకారం
"శత్రువులు ఊహించని స్థాయిలో ప్రతీకారం తీసుకోవాలి" అనే ప్రధాని సూచన మేరకే ఈ ఆపరేషన్ చేపట్టామని తెలిపారు. టెర్రరిస్టులకు మద్దతు ఇచ్చే పాక్ ఆర్మీ స్థావరాలపైనూ దాడులు జరిపామని పేర్కొన్నారు.

## పద్ధతి మారకపోతే చర్యలు తప్పవు అధికారులపై హోంమంత్రి అనిత సీరియస్

అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత.. విజయనగరం కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశానికి హాజరైన ఆమె.. డీఆర్సీలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఏదో కాకి లెక్కలతో కాగితాల దొంతులుగా ప్రెస్‌నోట్ మా కిచ్చి వెళ్లిపోతున్నారని ఫైర్ అయ్యారు.. కానీ, ఆ పేపర్లు తర్వాత చెత్త బుట్టలోకి వెళ్లిపోతున్నాయి.. అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు.. కానీ, ఇక ఇలాంటి పద్ధతికి చెల్లు చీటు చెప్పండి .ఇక నుంచి ముందే కలెక్టర్ వద్ద గత డీఆర్సీలో ఏం చేశామో చర్చించండి.. ఎంత వరకు పూర్తి చేశామో ముందే బ్రీఫ్ చేసి పెట్టుకోండి అని ఆదేశించారు..

విజయనగరం వెనుకబడిన జిల్లా అంటారు.. ఎవ్వరన్నారు వెనుకబడిన జిల్లా అని..జిల్లాకి అన్ని వనరులు ఉన్నాయి.. వర్షపాతం అధికంగా ఉన్నాయి.. నీటి నిలువలు అధికంగా ఉన్నాయన్నారు హోంమంత్రి అనిత.. అధికారులు ఏం పని చేస్తున్నారో నాకు అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ డీఆర్సీలో ప్రజాప్రతినిధులు ఏ సమస్యలు లేవనెత్తినా.. ఆ తర్వాత అది ఎంత మేర పరిష్కరించగలిగామో చెప్పాలి.. లేనిపక్షంలో కచ్చితంగా చర్యలు తప్పవు అని వార్నింగ్ ఇచ్చారు.. ఆర్ అండ్ బీ అధికారుల తీరుపై మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.. గతంలో హెవీ లోడ్స్ తో వెళ్లిన వాహనాలు ఎన్ని ఉన్నాయో ఆర్ అండ్ బీ, ఆర్టీవో సమన్వయంతో గుర్తించాలని అడిగాదు.. కానీ, ఇంత వరకు ఎందుకు సమన్వయ సమావేశం పెట్టుకోలేదు? అని నిలదీశారు.. ఇలా అయితే సస్పెండ్ చేయాల్సి ఉంటుందని ఆర్ అండ్ బీ అధికారులపై మంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు..

## "కొట్లాడితే ధీరుడితోనే కొట్లాడుతా.. రండలతో ఏం కొట్లాడను": ఈటల రాజేందర్ కౌంటర్

సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గురించి ఇష్టానుసారంగా మాట్లాడితే.. నడిరోడ్డుపై బట్టలిప్పి గుంజీలు తీయిస్తానని ఈటల రాజేందర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు మాటల యుద్ధానికి దారి తీస్తున్నాయి. ఈ క్రమంలోనే జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాస్ కౌంటర్ ఇచ్చారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ గతంలో ధనిక రాష్ట్రమని చెప్పిన రైతులకు రూ.లక్ష కూడా రుణమాఫీ చేయలేకపోయారని ఆరోపించారు. కేసీఆర్ విచ్చలవిడిగా అప్పులు చేసిన రైతుబంధు ఇచ్చారని కామెంట్ చేశారు. ఆర్థిక మంత్రిగా చేసిన అనుభవంతో.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ ల అమలు కష్టమని ఆనాడే చెప్పానని అన్నారు.
ప్రజలకు అబద్ధాలే నచ్చుతాయని ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. సరిగ్గా 16 నెలలు గడిచే సరికి రేవంత్ చెప్పిన అబద్ధాలు అక్షరాల నిజం అవుతున్నాయని ఫైర్ అయ్యారు. హైదరాబాద్ నగర పరిధిలో నిరుపేదల ఇళ్లను కూల్చేస్తున్నారని.. అదేంటని ప్రశ్నిస్తే ఇదే సీఎం ఎవరు అడ్డొచ్చినా బుల్డోజర్లతో తొక్కిస్తామని కామెంట్ చేశారని తెలిపారు. అప్పుడు తాను 'ఎవరు చెప్పినా వినని వాడిని నాయకుడని అనబోరని.. మనిషి అనరని సైకో అంటారని' కామెంట్ చేసినట్లుగా ఈటల క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే తనపై కాంగ్రెస్ లో ఉన్న కొంతమంది చిల్లరగాళ్లు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, తాను కొట్లాడితే.. ధీరుడితో కొట్లాడుతానే తప్ప రండలతో ఏం కొట్లాడను అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఏదో మార్పు తీసుకొస్తారని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారని.. కానీ, వారి పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడిన చందంగా మారిందని ఈటల రాజేందర్ అన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నేతలకు సోయి ఉందా..
సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలపై మండిపడిన యూత్ కాంగ్రెస్ నేతలు ఎంపీ ఈటల ఇంటి ముట్టడికి తరలివచ్చారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకుని పలువురు కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎంపీ ఈటల ఇంటికి పెద్ద ఎత్తున బీజేపీ కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలపై ఫైర్ అయ్యారు. కలెక్టరేట్లు, కార్యాలయాలను ముట్టడిస్తారని, ఎవరైనా ఇళ్లను మట్టడిస్తారా అని గరం అయ్యారు. అసలు సీనియర్ కాంగ్రెస్ నేతలకు సోయి ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ ఎందుకు పడిపోయిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని, అధికారంలో లేనప్పుడే కొట్లాడిని చరిత్ర బీజేపీ పార్టీదని ఈటల రాజేందర్ అన్నారు.

## సైన్యానికి సెల్యూట్: ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉగ్రవాదంపై భారత్ తీసుకున్న కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. ఇటీవల విజయవంతంగా ముగిసిన ఆపరేషన్ సిందూర్ అనంతరం ఆయన తొలిసారి జాతిని ఉద్దేశించి మాట్లాడారు. భారత సైన్యం ప్రదర్శించిన సాహసానికి, శౌర్యానికి సెల్యూట్ చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. "ఉగ్రవాదులు కలలో కూడా ఊహించలేనంత దారుణంగా భారత్ వారిపై దాడి చేసింది," అని అన్నారు.

"గడిచిన నాలుగు రోజులుగా మన సైన్యం అద్భుతమైన సాహసం చూపించింది. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, నిఘా సంస్థల సామర్థ్యం దేశమంతా చూశాయి. పహల్గాంలో జరిగిన మానవత్వానికి వ్యతిరేకమైన ఉగ్రదాడి దేశ ప్రజల మనసులను కుదిపేసింది. దేశ రక్షణ దళాల ధైర్య సాహసాలు దేశం తలమానికం" అని ప్రధాని పేర్కొన్నారు.


ఉగ్రవాద శిబిరాలపై భారత మిసైళ్లు, డ్రోన్లు నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించాయన్నారు. బహావల్పూర్, మురిద్కే వంటి ఉగ్రవాద కేంద్రాలను నాశనం చేయడం ద్వారా ప్రపంచానికి భారత ఉగ్రవాదంపై తన జీరో టాలరెన్స్ వైఖరిని చాటిందన్నారు. "పాక్ గర్వంగా చెప్పుకునే మిసైళ్లను ధ్వంసం చేసి, వారి రక్షణ వ్యవస్థను కదిలించలేని స్థితిలోకి తీసుకువచ్చాం. మన చర్యలతో భయభ్రాంతికి లోనైన పాక్ కాల్పుల విరమణ చర్చలకు పరుగెత్తింది," అని మోదీ చెప్పారు.

ఉగ్రవాదాన్ని దశాబ్దాల నుండి ప్రోత్సహిస్తున్న పాక్ శిబిరాలను ఒక్క దెబ్బతో తుదముట్టించామని ప్రధాని పేర్కొన్నారు. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, మిసైళ్లను సరిహద్దుల్లోనే అడ్డుకున్నట్లు తెలిపారు. "భారత క్షిపణులు పాక్ వైమానిక స్థావరాలు, రాడార్ స్టేషన్‌లను ధ్వంసం చేశాయి," అని వివరించారు.

పాక్‌తో చర్చలు భారత్ విధించిన షరతులకే పరిమితమని ప్రధాని స్పష్టం చేశారు. "అణు బ్లాక్‌మెయిలింగ్‌కు భారత్ తలవంచదు. ఉగ్రవాదంపై ఎలాంటి రియాయితీ లేదు. టెర్రరిజం, వాణిజ్యం, నీటి పంపిణీ ం ఇవేవీ ఉగ్రవాదంతో కలిసి నడవలేవు. పాక్ బతకాలంటే ఉగ్ర శిబిరాలను తుడిచిపెట్టాలి," అని ఆయన హెచ్చరించారు.

ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సాంకేతిక యుద్ధంలో ఉన్న పరిణతిని, ఆయుధ సంపత్తిని ప్రపంచానికి చూపించిందన్నారు. "మేడ్ ఇన్ ఇండియా రక్షణ వ్యవస్థల బలాన్ని ప్రపంచం చూశది. మన దేశం భవిష్యత్తులో కూడా ఇదే ధైర్యంతో ముందుకు సాగుతుంది," అని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు.

## 'ఇప్పటికైనా మించిపోయిందేం లేదు'.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ సూచన



కాంగ్రెస్ ప్రభుత్వం , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు. అందాల పోటీల్లో ముఖ్యమంత్రి మునిగితేలుతుంటే.. మరోవైపు వడదెబ్బకు తాళలేక ధాన్యం కుప్పలపైనే ఓ అన్నదాత బలికావడం అత్యంత బాధాకరమని అన్నారు. రేవంత్ చేతకానితనం వల్ల సీఎం సొంత జిల్లా పాలమూరులోని పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామంలో గుగులోతు కిషన్ (51) అనే రైతు నిండుప్రాణం గాలిలో కలిసిపోయిందని తెలిపారు. ఇది ముమ్మాటికీ ముఖ్యమంత్రి చేసిన హత్యే అని కీలక వ్యాఖ్యలు చేశారు. పెట్టుబడి సాయం ఎగ్గొట్టినా, రుణమాఫీ పేరిట మోసం చేసినా ఆరుగాలం కష్టించి పండించిన పంటను చివరికి కొనే దిక్కు కూడా లేకపోవడంతో.. తెలంగాణ రైతన్న అనాథలా మారాడని అని కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

అంతేకాదు.. ఓవైపు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం అకాల వర్షాలతో కండ్లముందే కొట్టుకుపోతున్న దుస్థితి.. మరోవైపు మండుతున్న ఎండలను తట్టుకోలేక రైతుల గుండెలు పగులుతున్న దయనీయ పరిస్థితి నెలకొందని అన్నారు. వీటికి పూర్తి బాధ్యత ఈ దద్దమ్మ కాంగ్రెస్ సర్కారుదేనని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో వారాల తరబడి పడిగాపులు పడుతున్నా పట్టించుకునే వాడు లేకపోవడంతో అసలు ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వడదెబ్బకు, సర్కారు నిర్వాకానికి బలైన అన్నదాత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రికి సోయి ఉంటే.. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతుల కష్టాలు తీర్చాలి. లేకపోతే కట్టలు తెంచుకునే అన్నదాతల ఆగ్రహానికి ఈ కాంగ్రెస్ సర్కారు కొట్టుకుపోతుందని అన్నారు.

## బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటే: స్క్రిప్ట్ రాసేది ఒకరు, మాట్లాడేది మరొకరు -మంత్రి పొంగులేటి

ఖమ్మం జిల్లా అభివృద్ధిలో తాము చేపట్టిన కార్యక్రమాల గురించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రస్తావిస్తూ, బీజేపీ–బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రమైన విమర్శలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఒకటే. ఒకరు స్క్రిప్ట్ రాస్తే మరొకరు మాట్లాడతారు అని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షం పాత్ర పోషించడంలో తప్పులేదు. కానీ విమర్శలు చేస్తే వాటికి సోయి ఉండాలి. ప్రజలు అన్నం తినలేదన్నట్టు బిల్డప్ ఇవ్వడం తప్ప మరొకటి కాదు అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మంత్రి.. సీతారామ ప్రాజెక్టుకు కరెంట్ కూడా ఇవ్వలేని స్థితిలో ఉండే ప్రభుత్వం ప్రజల అవసరాలపై ఎంత చిత్తశుద్ధితో పని చేసిందో చెప్పకనే చెప్పింది అని అన్నారు. భూమికి బదులుగా భూమి ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, కానీ తాత్కాలికంగా నగదు రూపంలో సాయం అందిస్తున్నామన్నారు మంత్రి పొంగులేటి. రెండు మూడు రోజుల్లో అందరికీ సాయం అందుతుంది. స్థలాలు పోతున్న వారికి పరిహారం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ఆర్థిక పరిస్థితి బలహీనంగానే ఉన్నా, సుమారు రూ.680 కోట్లతో 16%–%17 కిలోమీటర్ల రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఇప్పటికే 9 కిలోమీటర్ల పనులు మొదలయ్యాయి. రెండు పక్కల డ్రెయిన్, బీటీ రోడ్ కూడా నిర్మిస్తున్నారు అని అన్నారు. గత ఆగస్టులో మున్నేరు వాగు పరివాహక ప్రాంతాల్లో వేలాది కుటుంబాలు వరదల్లో ఇబ్బంది పడ్డాయని, సీఎం రేవంత్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, నేను, భట్టి విక్రమార్క కలిసి ఐదు ఆరు రోజులు అక్కడే పర్యవేక్షించామన్నారు. ఈ ప్రభుత్వం, గత ప్రభుత్వాలాగా జీవో ఇవ్వడంలో కాదు.. పనులు మొదలు పెట్టడంలో నిబద్ధత చూపుతోంది అన్నారు. ఇల్లు కోల్పోయిన పేదలకు స్థలాలు, ఇళ్లు అందిస్తాం. ఇరిగేషన్ భూములు ఉన్నవారు వాటిని ఇవ్వాలి. ప్రభుత్వంలో ఉద్యోగులు కూడా మా కుటుంబ సభ్యుల్లానే. సమస్యలను ఒప్పుకోకుండా ఎదుర్కోవడం సరైన పద్ధతి కాదు అని వ్యాఖ్యానించారు.

## పాక్ ఊసరవెల్లి మాటలు నమ్మవద్దు : కాల్పుల విరమణపై బలూచ్ రెబల్స్ హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి

"మేము ఫారిన్ ప్రాక్సీ కాదు"
తాము విదేశీ బానిస పార్టీ అంటూ వస్తున్న విమర్శలను బీఎల్ఏ ఖండించింది. "మేము ఎవరూ కీలుబొమ్మలు కాదూ, మౌనంగా కూర్చునే వాళ్లం కాదూ. ఈ ప్రాంత భవిష్యత్తులో మాకు తగిన పాత్ర ఉంది. మేము డైనమిక్, నిర్ణయాత్మక పార్టీ," అని స్పష్టం చేసింది.

బలూచిస్తాన్‌లో ఉగ్ర దాడుల కలకలం
ఈ నేపథ్యంలో, బలూచ్ లిబరేషన్ ఆర్మీ తమకు కీలకంగా భావిస్తున్న బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని మంగోచర్ నగరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు శనివారం ప్రకటించింది. 51 లక్ష్యాలపై దాడులు చేసినట్లు బీఎల్ఏ వెల్లడించగా, దీనిపై పాక్ ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. శుక్రవారం జరిగిన మరో దాడిలో 22 మంది పాకిస్థాన్ సైనికులు మృతి చెందారని స్థానిక మీడియా పేర్కొంది.
వనరులతో నిండిన భూమి, వంచిత బలూచ్ ప్రజలు
బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో నిక్షేపాలు, సహజ వనరులు విస్తారంగా ఉన్నా, అక్కడ ప్రజలు తీవ్ర పేదరికంతో బాధపడుతున్నారు. చమురు, బొగ్గు, బంగారం, సహజ వాయువు వనరుల ద్వారా పాక్ ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నప్పటికీ, ఆ ప్రాంత ప్రజలకు వాటి లాభం తక్కువగానే దక్కుతోంది. దశాబ్దాలుగా ప్రత్యేక దేశంగా బలూచిస్తాన్ ఏర్పాటు కోసం ఉద్యమం కొనసాగుతోంది.

## విద్యుత్ చార్జీలు పెంచబోము

విద్యుత్ చార్జీలు పెంచలేదు, పెంచబోమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని తెలిపారు. యాక్సిస్ గ్రూప్ ఫీల్డ్ ఎనర్జీ మీద వైసీపీ నేతలు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం మీద వైసీపీ నేతలు పదే పదే బురదజల్లే పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ(సోమవారం) ప్రకాశం జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడారు.
గత ప్రభుత్వంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పులు సరిదిద్దడానికే తమకు టైం సరిపోతుందని చెప్పారు. విద్యుత్ శాఖను జగన్ దుర్వినియోగం చేశారని ఆరోపించారు. యాక్సిస్ ఎనర్జీకి రూ.5.12లకు జగన్మోహన్ రెడ్డి ఒప్పందం చేసుకున్నారని... తమ ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకుని రూ. 4.60లకు పీక్ అవర్స్‌లో కూడా విద్యుత్ సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నామని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం విద్యుత్ శాఖను తమ ఆదాయ వనరుగా మార్చుకుందని విమర్శలు చేశారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రాంతాల్లో రెన్యువబుల్ ఎనర్జీకి పెద్దపీట వేశామని ఉద్ఘాటించారు. రెన్యువబుల్ ఎనర్జీలో దేశంలో రాయలసీమ ప్రాంతం అనుకూలమని చెప్పారు. తప్పుచేసిన వారికి రెడ్‌బుక్ వర్తిస్తుందని హెచ్చరించారు. అవసరం లేకుండా ఈ ప్రభుత్వం ఎవరిని ఇబ్బంది పెట్టదని స్పష్టం చేశారు. గతంలో తప్పులు చేసిన వారికే రెడ్‌బుక్ వర్తిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు.

## ఆర్నెళ్లు జైల్లో ఉన్నది సరిపోదా.. ఇంకా నన్ను కష్టపెడతారా?: ఎమ్మెల్సీ కవిత

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన కామెంట్స్ చేశారు. తనపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, కుట్రలు పన్నుతున్నారని ఆమె ఆరోపించారు. సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు బయటపెడతానని అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన అనంతరం చిట్ చాట్‌లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. 47 నియోజకవర్గాల్లో పర్యటనలు పూర్తి చేశానని.. ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను మాత్రమే తాను చెబుతున్నానని, పరిస్థితుల ఆధారంగానే సామాజిక తెలంగాణ అంశాన్ని ప్రస్తావించానని అన్నారు. పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతున్న సమయంలో తనపై దుష్ప్రచారం చేయడం సరికాదని ఆమె అన్నారు.
నన్ను రెచ్చగొట్టకండి. ఆర్నెళ్లు జైల్లో ఉన్నది చాలదా? ఇంకా నన్ను కష్టపెడతారా?' అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తనను రెచ్చగొడితే మరింత గట్టిగా స్పందిస్తానని హెచ్చరించారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై పార్టీ స్పందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల మేడే కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ.. భౌగోళిక తెలంగాణ సాధించినా.. సామాజిక తెలంగాణ ఇంకా సాధించలేకపోయామని వ్యాఖ్యానించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన న్యాయం, అవకాశాలు ఇంకా అందడం లేదని అన్నారు. సామాజిక అసమానతలు, వివక్ష ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.సామాజిక తెలంగాణ సాధన కోసం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు.
ఈ కామెంట్స్ రాజకీయంగా బీఆర్ఎస్‌పై విమర్శలకు దారితీసింది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీంతో కవిత సొంత పార్టీ పాలనను విమర్శిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే తన వ్యాఖ్యలను వక్రీకరించారని కవిత వెల్లడించారు. పార్టీ బలోపేతం కోసమే తాను పనిచేస్తున్నానని.. ప్రజల అభిప్రాయాలను మాత్రమే వెల్లడించానని స్పష్టం చేశారు. తాజాగా కవిత తనను రెచ్చగొట్టవద్దని చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో అంతర్గతంగా ఏం జరుగుతోందనే చర్చకు దారితీశాయి. ఆమె చేసిన వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ పరిణామాలతో బీఆర్ఎస్‌లో ఏం జరుగుతుందోననే చర్చ జోరందుకుంది.

## ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను పరిశీలించిన అధికారులు



మోత్కూర్ 12మే (క్రాంతి న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో మోత్కూరు మండలంలోని దాచారం ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను మండల అగ్రి కల్చర్ ఆఫీసర్ కీర్తి, ఏఈఓ పాటిమట్ల రైతు వేదిక పరిధి ఎం .అశోక్ సమన్వయం తో జిల్లా న్యాయ సేవాధికారా సంస్థ పారా లీగల్ ప్రతినిధులు కురిమేటి యాదయ్య ఇటికాల లింగయ్య ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. అక్కడ తూకం(క్వాంట) పని తీరును పరిశీలించడం జరిగింది. రైతుల పంట కొనుగోలు రశీదులు, ట్రక్ షీట్ బుక్ లను పరిశీలించడం జరిగింది. మార్కెట్ లో రైతులు నష్టపోతున్న తీరును గమనించి వారికి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా రైతులకి అవగాహన కల్పించడం జరిగింది. దాచారం వీఓ ప్రతినిధి లక్ష్మి, రైతులు నోముల మల్లేష్, అండెం ప్రతాప్ రెడ్డి, మెడబోయిన యాదమ్మ, కప్పల రేణుక తదితరులు పాల్గొన్నారు.దీనిపై పూర్తి వివరాలతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ యాదాద్రి భువనగిరి జిల్లా వారికి నివేదిక అందజేశారు.

# నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

### ప్రజలకు మాట ఇస్తే తప్పుకునేదే లేదు

### ప్రతి పనిని చిత్తశుద్ధితో పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన మంత్రి సీతక్క

ములుగు జిల్లా ప్రతినిధి,12 మే క్రాంతి న్యూస్ ):రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వం ప్రతి పనిని చిత్తశుద్ధితో పూర్తి చేయడమే కాకుండా ఇచ్చిన మాట కట్టుబడి ప్రతి పనిని పూర్తి చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. తాను ములుగు నియోజకవర్గంలోని ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నానని స్పష్టం చేశారు. సోమవారం మంగపేట మండలం శనగకుంటగ్రామంలో అగ్నిమాపక బాధితులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరం జరిగిన అగ్ని ప్రమాదంలో శనిగ కుంటలోని కొన్ని కుటుంబాల వారు సర్వస్వం కోల్పోగా ఆ క్షణమే కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బాధితకుటుంబాలకు వంట సామాన్లతో పాటు బట్టలను అందజేయడం జరిగిందని, 300 స్వచ్ఛంద సంస్థలతో బాధిత కుటుంబాలకు సహాయం అందించడం జరిగిందని వివరించారు. అగ్నిమాపక బాధితులు ధైర్యం కోల్పోకుండా ఆత్మవిశ్వాసం కల్పించడానికి ప్రత్యేక సహాయ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఐటిడిఏ ద్వారా ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ముఖ్యంగా మంచినీటి ఎద్దడిని నివారించడానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో నేడు ప్రతి ఇంటి ఇంటికి నల్లాల ద్వారా మంచినీటిని అందించడం జరుగుతుందని, గతంలో తాను ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి భూమి పూజ చేయడం సంతోషం కలిగిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ మంచి నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని చర్యలు తీసుకుంటున్నామని, పరిపాలన కేంద్రంగా ఉంటున్న ఐటీడీఏలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారని అన్నారు.



ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానీ పేదలు ఎవరు ఆందోళన చెందవద్దని రెండవ దఫా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్న లబ్ధిదారులకు త్వరగాతిన బిల్లులు చెల్లించడానికి కలెక్టర్ చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ శనిగకుంట గ్రామంలో నీటి సమస్య ఉన్న కారణంగా గ్రామస్తులు నీటిని నిలువ చేసుకొని సేవించడం వలన అనేక వ్యాధుల బారిన పడ్డారని, మంత్రి ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో మంచినీటి సమస్యను తీర్చామని అన్నారు.

ప్రభుత్వం, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ప్రతి పనిని చిత్తశుద్ధితో పూర్తి చేయడానికి చొరువ చూపుతున్నామని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరువిషయంలో మధ్యవర్తులకు ఏమాత్రం అవకాశం కల్పించడం లేదని స్పష్టం చేశారు. వరద ముప్పు, అగ్ని ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా సాయంచేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి, తాసిల్దార్ రవీందర్, ఎంపీడీవో, ఆయా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైప్ లైన్లకు 2 కోట్లు మంజూరు చేయండి

### - జలమండలి ఎండి అశోక్ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



రామచంద్రాపురం,12 మే క్రాంతి న్యూస్ ):పటాన్ చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యలపై హైదరాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కలిసిన భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ చందు ఆదర్శ్ రెడ్డి, బిఆర్ఎస్ పటాన్ చెరు నియోజకవర్గ కన్వీనర్ ఆదర్శ్ రెడ్డి

డివిజన్ లో సుమారు 2 కోట్ల తో డ్రైనేజ్ పైపులైన్లు లకు కొత్త ప్రతి పాదనలు ఇవ్వడం జరిగింది.అలాగే రామచంద్రపురం మెయిన్ రోడ్ లో ఇటీవల నేషనల్ హైవేస్ రోడ్ వెడల్పు లో భాగంగా డ్రైనేజ్ లైన్ ను స్టార్మ్ వాటర్ డ్రైన్ లో కలపడం తో కాలనీ లో తీవ్ర డ్రైనేజ్ సమస్య ఉంది అని తెలిపారు.నేషనల్ హైవేస్ రోడ్ సమాంతరంగా డ్రైనేజ్ పైప్లైన్ లకు 2 కోట్ల పనులకు మంజూరు చేయాలని కోరారు.మ్యాక్ సొసైటీ,ఎల్. ఐ.జీ కాలనీ,ఫెన్సింగ్ ఏరియా లో డ్రైనేజ్ సమస్య ఉంది అని తెలుపుతూ సుమారు 2కోట్ల ప్రతిపాదనలకు మంజూరు చేయాలని కోరారు.మ్యాక్ సొసైటీ కాలనీలో పెండింగ్ లో ఉన్న మంచినీటి బిల్లులు ఓటిస్ స్కీమ్ ఒకేసారి సెటిల్ మెంట్ చేసి డబ్బులు కట్టిన,వాటర్ బిల్లు వస్తున్నాయని, వాటిని త్వరగా మాఫీ చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.జలమండలి ఏం.డి స్పందించి అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ కి వివరించారు.

## నూతన టిడిపి గార్ల మండలం కమిటీ ఎన్నిక అధ్యక్షులుగా ఎలమా. కృష్ణారెడ్డి కార్యదర్శిగా కత్తి. సత్యం ఏకగ్రీవంగా ఎన్నిక





గార్ల,12 మే క్రాంతి న్యూస్ ):గార్ల మండలంలో పట్టణ కేంద్ర పార్టీ ఆఫీసులో తెలుగుదేశం సంస్థాగత ఎన్నికలు మే 12న టిడిపి ఆఫీసులో జరిగినవి. ఈ మండల కమిటీ సమావేశానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి,ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జి.యం.డి. ఇమామ్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాగా అన్ని కమిటీలను ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్తామని ఆయన విలేకరుల సమావేశంలో అన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామపంచాయతీ లో ఎన్నికల్లో పోటీ చేస్తామని టిడిపి కార్యకర్తలకు హామీ ఇచ్చారు.



అదేవిధంగా నూతన మండల కమిటీ ఎన్నిక జరగగా తిరిగి మరల గార్ల మండల టిడిపి అధ్యక్షులుగా ఎలమారెడ్డి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కత్తి సత్యం గౌడ్,ఉపాధ్యక్షుడిగా బానోత్. రాంజీ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నూతన పార్టీ ప్రభాకర్,జస్తి.రాజా,మేడేపల్లి ధశరద్, వీరన్న,కార్యదర్శులు ఎస్.కె ఖాసీంభీ,శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఉపేందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎండి ఇమామ్ పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు







లక్షెట్టిపేట,12 మే క్రాంతి న్యూస్ ):మున్సిపాలిటీ పరిధి లోని మోదెల రోడ్ లో శంఖ చక్రములు,పట్టే నామాలతో స్వయంభువుగా వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి గుట్ట వద్ద నిర్వహించిన గిరి ప్రదక్షిణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సోమవారం పాల్గొని స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు, ఆవోపా అధ్యక్షులు కొత్త కిరణ్ కుమార్, చింతల శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, ఆలయ అడక్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయ్యాలి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



వికారాబాద్,12 మే (క్రాంతి న్యూస్ ): సోమవారం ప్రజావాణి సందర్భంగా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆర్డిఓ వాసు చంద్ర లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించారు.ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా అధికారులు సమాచారం ఇవ్వకుండా ప్రజావాణికి గైర్హాజర్ కాకూడదని కలెక్టర్ అధికారులను సూచించారు. ప్రజావాణిలో (68) అర్జీలు రాగా ఎక్కువ శాతం భూ సమస్యలు, పెన్షన్లు, హౌసింగ్, వ్యవసాయ రంగానికి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి.ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హుస్నాబాద్ డివిజన్ నూతన ఏసిపి గా పదవీ బాధ్యతలు చేపట్టిన యస్. సదానందం



హుస్నాబాద్,12 మే క్రాంతి న్యూస్ ):హుస్నాబాద్ డివిజన్ నూతన ఏసిపి గా పదవీ బాధ్యతలు చేపట్టిన యస్. సదానందం, సోమవారం మర్యాద పూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ని కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అభినందించి హుస్నాబాద్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని సూచించారు మరియు గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిగా ఏర్పాటు చేయాలని సూచించారు. మరియు అసాంఘిక కార్యక్రమాల జరగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా విసబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలని తెలిపారు.ఏసిపి వ్యక్తిగత వివరాలు 1996 బ్యాచ్, ఎస్ఐగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పనిచేయడం జరిగింది.సీఐగా వరంగల్ పిటిసి, ఉట్నూర్, అదిలాబాద్ జిల్లాలో పనిచేయడం జరిగింది. ఏసీపీగా ప్రమోషన్ పొంది కరీంనగర్ ఇంటలిజెన్స్ లో రెండు సంవత్సరాలు పూర్తిచేసుకుని, ఈరోజు హుస్నాబాద్ ఏసిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.



# తిరుమలలో మరోసారి చిరుత కలకలం.. వణికిపోయిన భక్తులు



తిరుమల,12 మే (క్రాంతి న్యూస్ ):తిరుమల శ్రీవారి భక్తుల్ని మరోసారి చిరుత భయం వెంటాడుతోంది. తిరుమల రెండో ఘాట్‌రోడ్డులోని వినాయకస్వామి ఆలయ సమీపంలో తాజాగా చిరుత సంచారం కలకలం రేపింది. ఆలయ సమీపంలో సోమవారం చిరుత రోడ్డు దాటుతున్న సమయంలో వాహనదారుల కంటపడింది. వెంటనే వారు అప్రమత్తమై టీటీడీ అలిపిరి భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులు పరిసరాలను పరిశీలిస్తున్నారు. ఇటీవల కాలంలో తిరుమల ఘాట్ రోడ్లలో చిరుత సంచారం కనిపిస్తోంది. ఇప్పుడు వేసవి కాలం కావడంతో అడవి జంతువులు ఇలా వస్తున్నాయని చెబుతున్నారు.

తిరుమలలో రెండు, మూడు నెలల క్రితం కూడా చిరుతల సంచారం కనిపించింది. తిరుమలతో పాటుగా తిరుపతిలో కూడా చిరుతలు సంచరించాయి. ఆ సమయంలో టీటీడీ అలర్ట్ అయ్యింది.. తిరుమలకు నడకమార్గాల్లో వెళ్లే భక్తుల్ని గుంపులు, గుంపులుగా కొండపైకి వెళ్లాలని సూచించింది. మళ్లీ తాజాగా ఘాట్ రోడ్డులో చిరుత సంచారం కలకలం రేపింది. దీంతో వాహనదారులు ఘాట్ రోడ్డులో అలర్ట్‌గా వెళ్లాలని టీటీడీ, అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. అలాగే నడక మార్గాల్లో వెళ్లే భక్తులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి అంటున్నారు అధికారులు.

పొన్నకాల ఉత్సవం

వైశాఖ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ గోవిందరాజస్వామివారి పొన్నకాల్వ ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ఆలయం నుండి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, ఆండాల్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి, విష్వక్సేనులవారు తొమ్మిది మంది దేవేరులతో ఊరేగింపుగా తనపల్లి రోడ్డులో గల పొన్నకాల్వ మండపానికి ఊరేగింపు చేరుకున్నారు. అనంతరం అక్కడ ఉదయం 9 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్ళతో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు అభిషేకం చేశారు. అనంతరం సేవాకాలం, శాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు.

సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు ఊంజలసేవ, ఆస్థానం చేపట్టారు. ఆ తరువాత సాయంత్రం 5 గంటలకు శ్రీగోవిందరాజస్వామివారు అక్కడినుండి బయలుదేరి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. గోవిందరాజస్వామివారు వచ్చే సమయంలో అమ్మవారి ఆలయంలో ఒక తలుపు మూసి ఉంచుతారు. బావగారైన గోవిందరాజస్వామివారు వచ్చారని పద్మావతి అమ్మవారు లోపలి నుండి ఆసక్తిగా తొంగి చూస్తారని, అందుకే ఆలయం ఒక తలుపు మూసి ఉంచుతారని పురాణాల ద్వారా తెలుస్తోంది. అక్కడ పూజాధికాలు ముగించుకుని గోవిందరాజస్వామివారు ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరారు. రాత్రి 9.30 గంటలకు తిరిగి శ్రీ గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకోవడంతో పొన్నకాల్వ ఉత్సవం ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయంగార్లు, ఆలయ డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈఓ ముని కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు ఎ.వి.శేషగిరి, చిరంజీవి, ఆలయ ఇన్స్పెక్టర్‌లు యు.ధనుంజయ, రాధాకృష్ణ ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు బంపర్ బొనాంజా.. భారీగా జీతాలు పెంపు



క్రాంతి న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్లకు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గెస్ట్ ఫ్యాకల్టీకి జీతాల పెంపుపై ఇప్పటికే నిర్ణయం తీసుకోగా.. సోమవారం దీనికి సంబధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వారికి గంటకు రూ.150 చొప్పున నెలకు రూ.10,000 వరకూ జీతంగా చెల్లిస్తున్నారు. అయితే దీనిని పెంచాలంటూ గత కొన్నేళ్లుగా గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే గంటకు రూ.375 వరకూ పెంచుతూ.. గరిష్ఠంగా నెలకు రూ.27,000 చెల్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. తాజాగా దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొంది.

మరోవైపు పీజీ పూర్తి చేసిన వారిని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా తీసుకుంటూ ఉంటారు. పోస్టుల భర్తీకి ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తుంది. పీజీలో 60% మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు కాగా.. ఏపీసెట్, యూజీసీ నెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఇంటర్వ్యూలు, డెమో లెక్చర్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. గెస్ట్ లెక్టరర్ల పోస్టుల కోసం సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్‌లు, లేదా అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా నోటిఫికేషన్‌లను పరిశీలించి, అవసరమైన డాక్యుమెంట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూలు, డెమో లెక్చర్లు ద్వారా ఎంపిక చేస్తారు. అయితే గెస్ట్ లెక్చరర్లకు అందించే వేతనం తక్కువగా ఉందని.. దీనిని పెంచాలంటూ జూనియర్ కాలేజీల్లో పనిచేసే గెస్ట్ ఫ్యాకల్టీ గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు.

ఈ క్రమంలోనే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్లకు వేతనం పెంచాలని టీడీపీ కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఇప్పటి వరకూ గంట పీరియడ్‌కు రూ.100 చెల్లిస్తూ ఉండగా.. ఇకపై ఆ మొత్తాన్ని 375 రూపాయలకు పెంచారు. అలాగే గరిష్టంగా ఇప్పటి వరకూ 10 వేలు వేతనంగా అందుతుండగా.. ఇకపై గెస్ట్ లెక్చరర్లకు గరిష్ఠంగా నెలకు రూ.27 వేలు చొప్పున అందనుంది. దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడ్డాయి. మరోవైపు ఏపీ ప్రభుత్వ నిర్ణయంపై గెస్ట్ లెక్చరర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు



ఏపీ ,12 మే (క్రాంతి న్యూస్ ):ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షం పడుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో సూర్యుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. దీంతో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే సూర్య ప్రతాపం కొనసాగుతోంది. ఉదయం 10 గంటల సమయానికే రోడ్ల మీదకు రావాలంటే జనం జంకుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ దంచికొడుతోంది. ఈ క్రమంలో ఏపీలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపింది. సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం కాకానిలో 43.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రాష్ట్రంలోని 17 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు,

మంగళవారం 21 మండలాల్లో తీవ్ర, 32 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాలు, విజయనగరం జిల్లాలోని 2 మండలాలు, కాకినాడ జిల్లాలో మూడు, తూర్పు గోదావరి జిల్లాలో ఒక మండలంలో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తీవ్రమైన ఎండ ప్రభావం, వడగాలుల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. మధ్యాహ్న వేళల్లో వీలైనంత వరకూ బయటకు రాకుండా ఉండటం మంచిదని సూచించింది. మరోవైపు ఎండలతో పాటుగా కొన్ని జిల్లాలలో మంగళవారం వర్షం కూడా కురవనుంది. మంగళవారం రాయలసీమలో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది.గురువారం రాష్ట్రంలో మోస్తారు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపింది.

మరోవైపు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నారు.మంగళవారం విజయనగరం, ఏలూరు, ప్రకాశం, వైఎస్ఆర్ జిల్లాలలో.. బుధవారం పార్వతీపురం మన్యం, అనకాపల్లి, పశ్చిమ గోదావరి, గుంటూరు, పల్నాడు, నెల్లూరు, అన్నమయ్య , అనంతపురం జిల్లాలలో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాకినాడ, చిత్తూరు జిల్లాలో శుక్రవారం మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

# దేశంలోనే పొడవైన గాజు వంతెన..



ఏపీ ,12 మే (క్రాంతి న్యూస్ ):ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలను టూరిస్ట్ స్పాట్‌లుగా అభివృద్ధి చేసి ఏపీలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉంది. ఈ క్రమంలోనే సముద్ర తీర ప్రాంతం వెంబడి అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఏపీలో బెస్ట్ టూరిస్ట్ స్పాట్ ఏంటంటే ప్రతి ఒక్కరూ ఠక్కున చెప్పేమాట .. విశాఖపట్నం. సాగర హొరు.. అలల జోరు.. ప్రకృతి అందాలతో వైజాగ్ పర్యాటకులను కట్టిపడేస్తూ ఉంటుంది. పోర్టు నుంచి మ్యూజియం వరకూ.. సింహాచలం దేవస్థానం, బీచ్‌లు, కైలాసగిరి ఇలా ఒక్కటేమిటి ఎన్నో అందాలు విశాఖ సొంతం. అలాంటి విశాఖ సిగలో మరో మణిహారం చేరనుంది.

విశాఖపట్నంలో భారతదేశంలోనే అత్యంత పొడవైన గాజు వంతెన నిర్మితమవుతోంది. నిర్మాణం కూడా దాదాపుగా పూర్తి కావొచ్చింది. విశాఖపట్నంలో పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించడంలో భాగంగా భారతదేశంలోనే అతి పొడవైన కాంటిలివర్ గ్లాస్ స్కైవాక్ వంతెన ను నిర్మిస్తున్నారు. 50 మీటర్ల పొడవు ఉండే ఈ గాజు వంతెనను విశాఖపట్నం కైలాసగిరి వద్ద టైటానిక్ వ్యూపాయింట్‌కు దగ్గరగా ఏర్పాటు చేస్తున్నారు. సముద్రపు అందాలు, ప్రకృతి సౌందర్యాలను ఆకాశం నుంచి వీక్షించేలా.. సాహస ప్రియులకు, ప్రకృతి ప్రేమికులకు ఈ గ్లాస్ స్కైవాక్ మరపురాని అనుభవాన్ని అందించనుంది.

ఈ ప్రాజెక్టు కోసం సుమారుగా 6 కోట్లు ఖర్చవుతుందని అంచనా. 2024 నవంబర్‌లో గాజు వంతెన నిర్మాణం ప్రారంభమైంది. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. ఈ గాజు వంతెన నిర్మాణం పూర్తి అయితే భారతదేశంలోనే అతి పొడవైన కాంటిలివర్ గ్లాస్ స్కైవాక్ వంతెనగా విశాఖ గాజు వంతెన నిలవనుంది. ఓవైపు సముద్రం, మరోవైపు కొండల అద్భుతమైన దృశ్యాలతో, నేల నుంచి ఎత్తులో నడుస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలో దీనిని నిర్మిస్తున్నారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు ప్రైవేట్ సంస్థలు ఈ గాజు వంతెన నిర్మాణంలో పాలుపంచుకుంటున్నాయి.

ఒకేసారి 40 మంది వరకూ దీనిపై నిల్చునేలా ఈ గాజు వంతెన నిర్మిస్తున్నారు. స్కైవాక్‌తో పాటు, రెండు జిప్-లైన్‌లు, స్కై-సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్కటి 150 మీటర్లు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం కేరళలోని వాగమోన్ గ్లాస్ బ్రిడ్జి భారతదేశంలోనే అత్యంత పొడవైన గాజు వంతెనగా పేరొందింది. ఇది 40 మీటర్ల పొడవు ఉంటుంది. కైలాసగిరి స్కైవాక్ నిర్మాణం పూర్తి అయితే ఆ రికార్డును విశాఖపట్నం స్కైవాక్ బద్ధలు కొట్టనుంది. భారతదేశంలోనే పొడవైన గాజు వంతెనగా కైలాసగిరి గ్లాస్ స్కైవాక్ నిలుస్తుంది.

# పర్యాటక సంస్థలకు ఈపీఎఫ్, ఈఎస్ఐ రాయితీ

EPFO
Employees Provident Fund Organisation

ఏపీ ,12 మే (క్రాంతి న్యూస్ ): పర్యాటక రంగంలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించే దిశగా.. కూటమి ప్రభుత్వం ఉపాధి ప్రోత్సాహక విధానాన్ని ప్రకటించింది. కనిష్ఠంగా రూ.కోటి పెట్టుబడి పెట్టే ప్రాజెక్టులను యూనిట్‌గా తీసుకొని ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు యజమాని (ఎంప్లాయర్) చెల్లించాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ వాటా మొత్తాలను మూడేళ్ల వరకు ప్రభుత్వమే సమకూర్చనుంది. కొత్త పర్యాటక విధానం-2024-29కి అనుబంధంగా సోమవారం ఎంప్లాయిమెంట్ ఇన్సెంటివ్ పాలసీని ప్రకటించింది. పర్యాటక రంగానికి ఇప్పటికే పారిశ్రామిక హోదా కల్పించగా, పర్యాటకులను ఆకట్టుకునే వివిధ కార్యక్రమాలను మరింతగా ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూనిట్ కనిష్ఠ పెట్టుబడి రూ.కోటి ఉండీ.. 25 మందికి ఉపాధి కల్పిస్తే ఈపీఎఫ్, ఈఎస్ఐలో యజమాని వాటా 100%, 15-24 మంది ఉంటే 75%, 10-14 మంది ఉద్యోగులుంటే 50% మేర ప్రోత్సాహకంగా మూడేళ్లపాటు చెల్లించనున్నారు. ఇందుకోసం ఆయా ప్రాజెక్టుల కార్యకలాపాలు నిర్దేశించిన గడువులోగా ప్రారంభమై ఉండాలి. ఉద్యోగులు కంపెనీ 'పేరోల్'లో విధిగా ఉండాలి. ముఖ్యంగా సాహస కార్యకలాపాలు (అడ్వెంచర్), రెస్టారెంట్/ఫ్లోటింగ్ రెస్టారెంట్, మీటింగ్, కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్లు (ఎంఐసీఈ), వినోద ఉద్యానవనాలు (అమ్యూజ్‌మెంట్ పార్కులు), పర్యావరణ, పర్యాటక (ఎకో-టూరిజం) లాడ్జిలు, హౌస్‌బోట్లు, కల్చరల్, హెరిటేజ్ కార్యకలాపాలకు ఈ రాయితీలు వర్తించనున్నాయి.

# తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడిగా
# కొత్తపల్లి సతీష్ ఎన్నిక



పెనుగంచిప్రోలు, మే 12 ( క్రాంతి న్యూస్ ): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు నూతన గ్రామ అధ్యక్షుల ఎన్నికపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య అధ్యక్షతన సోమవారం సాయంత్రం స్థానిక ఆర్కే ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నూతన ఎన్నికపై కార్యకర్తలతో చర్చించారు. మరలా కొత్తపల్లి సతీష్ గ్రామ అధ్యక్షుడిగా ఉండాలని కార్యకర్తలు అందరూ ఏకాభిప్రాయం తెలిపారు. ఈ సందర్భంగా చింతల సీతారామయ్య మాట్లాడుతూ కార్యకర్తలు అదరూ

ఇదే మారిగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి విధేయుడుగా ఉంటున్న మాజీ మంత్రివర్యులు నెట్టెం రఘురాం కు రాష్ట్ర నాయకత్వం సముచిత స్థానం కల్పించాలని మండల పార్టీ తరఫున కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ లు కర్ల వెంకటనారాయణ, కాకాని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు, చుంచు రమేష్ బాబు, గజ్జి కృష్ణమూర్తి, గింజుపల్లి గోపి, నల్లమోలు వర ప్రసాద్, కర్ల నాగేశ్వరావు, నలుపునేని కొండ, ముళ్లపాటి ప్రసాద్, ప్రభాకర్, నూతల పాటి కృష్ణ, కొలిపాక బ్రహ్మం, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ భక్తాంజనేయస్వామి దేవస్థానం లో అన్న ప్రసాద వితరణ చేసినటువంటి ఏ ఎం సి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



పరకాల (మే 12 క్రాంతి న్యూస్ ): సోమవారం భక్తాంజనేయ స్వామి దేవస్థానం మల్లక్కపేట దేవాలయంనందు ఆంజనేయ స్వామి మాలధారుల స్వాములకు అన్న ప్రసాద వితరణ చేసినట్టువంటి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఇట్టి కార్యక్రమం లో పాల్గొన్న వారు పరకాల మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, టెంపుల్ చైర్మన్ అంబిరి మహేందర్, ఆలయ ప్రధానార్చకులు కాటూరి జగన్నాధాచార్యులు, అల్లం రఘు నారాయణ, కొత్తపల్లి రవి, టెంపుల్ డైరెక్టర్ మిట్ట బాలరాజు, టెంపుల్ డైరెక్టర్ దొమ్మటి శంకరయ్య, మంద నాగరాజు, దుప్పటి సాంబశివుడు ఇతరులు పాల్గొన్నారు

# చిన్ననాటి స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

మంథని, మే 12 (క్రాంతి న్యూస్ ) : తమతో చదివిన చిన్ననాటి మిత్రుడు రాయి ప్రకాష్ కూతురి వివాహ విషయం తెలుసుకున్న మిత్రులు ఒక్కటై సోమవారం ప్రకాష్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. బాల్య మిత్రులంత ప్రకాష్ కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకుని బృందంగా ఏర్పడి చేయి చేయి కలిపి చేతనైనంత సహాయాన్ని చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు నగదును సేకరించిన



మొత్తాన్ని మిత్రుని కూతురి వివాహ ఖర్చుల నిమిత్తం రూ.58 వేల రూపాయలను పోగుచేసి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం చేసిన బాల్య మిత్రులకు రాయి ప్రకాష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రులు దుమ్మని లక్ష్మణ్, నీలం రమేష్, కొంతం అనిల్, బండ మొగిలి, ఆర్ల బాపు తదితరులు పాల్గొన్నారు.

# బీరప్ప స్వామి కామరాతి దేవిల కళ్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి పూజలు



మెదక్ ప్రతినిధి:12మే (క్రాంతి న్యూస్ ): పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ బీరప్ప స్వామి కామరాతి దేవి ల కళ్యాణ మహెూత్సవంలో సోమవారం మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ బీరప్ప ఆలయంలో బీరప్ప స్వామి కామరాతి దేవి కళ్యాణ మహెూత్సవం ఘనంగా నిర్వహించడం శుభదాయకమని రామతీర్థం గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్టు



తెలిపారు. అనంతరం కురుమ సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో, ఏడుపాయల మాజీ చైర్మన్ లు బాలగౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, తాజా మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, బద్రి మల్లేశం, నాయకులు బాబా గౌడ్, సాయిరెడ్డి, దుర్గయ్య, అనిల్ రెడ్డి, కురుమ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**▸▸ప్రజావాణి కలెక్టర్ రాహుల్ రాజ్. ▸▸ప్రజావాణిలో (74) దరఖాస్తుల స్వీకరణ. ▸▸మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**



మెదక్ ప్రతినిధి,12 మే (క్రాంతి న్యూస్ ): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో లిఇంచార్జ్ అదనపు కలెక్టర్ భుజంగరావు , జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఇతర జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో భూ సమస్యలు-23 పింఛన్లు- 04, ఇందిరమ్మ ఇండ్లు-09 ఉపాధి ఉద్యోగాల కొరకు-01 ఇతర సమస్యలు -37 మొత్తం 74 దరఖాస్తులు వచ్చాయని అట్టి వినతులను సంబంధిత శాఖ అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని.. ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. తమ వినతులకు తప్పకుండ పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని అధికారులు ప్రజలకు కలిగించేలా ప్రత్యేక శ్రద్ధ వహించి.. క్షేత్ర స్థాయిలో త్వరగా విచారణ చేసి వివిధ సమస్య ల పైన వచ్చిన వినతులకు పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.





# సనత్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చల్లా.

పరకాల (మే 12 క్రాంతి న్యూస్ ): పరకాల బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రియ శిష్యుడు శాతరాశి సనత్ కుమార్ పటేల్ జన్మదిన వేడుకల సందర్భంగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి సనత్ కుమార్ కు తిరుమల తిరుపతి దేవస్థాన శాలువాతో సన్మానించి స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు పరకాల బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, అలియాబాద్ మాజీ ఉప సర్పంచ్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మే 20 న జరిగే దేశా వ్యాప్త సమ్మె,గ్రామీణ బంద్
# జయప్రదానికై ప్రజా సంఘాల ప్రచారం

## సూపర్డెంట్ సత్యనారాయణకు సమ్మె నోటీస్ ఇచ్చిన సి ఐ టీ యు మహిళా సంఘాలు

మంచిర్యాల,12 మే (క్రాంతి న్యూస్ ): కేంద్రంలోని బీజేపీ, మోడీ ప్రభుత్వం ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చెయ్యాలి. దేశ సంపదను బడా ప్రయివేట్ కార్పోరెట్ సంస్థలకు అప్పగించవద్దు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తెచ్చిన 4 లేబర్ కొడులను రద్దు చెయ్యాలి. వ్యవసానికి నిధులు కేటాయించాలి, పంటలకు కనీస మద్దతు ధరలు కల్పిస్తూ చట్టం చెయ్యాలి. ఉపాధి హామీ పథకాన్ని సరిపడా నిధులు కేటాయించాలి, సం.రానికి 200 రోజుల పని, రోజు కూలీ రూ:600/ లు అమలు చెయ్యాలి. కార్పొరేట్ సంస్థలకు అడవులను, ఖనిజ సంపదను కట్ట బెట్టడడం కోసం ప్రభుత్వ ఆదివాసీలపై జరుపుతున్న హింసను నిలిపివేయాలి.

దేశంలో మహిళపై జరుగుతున్న హత్య చారలు, హత్యలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మే 20 న దేశా వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ నిర్వహించడం జరుగుతుంది. ఈ సమ్మెకు, గ్రామీణ బంద్ కు ప్రజా సంఘాలు మద్దతు తెలియజేస్తు ఈ రోజు చెన్నూర్ లో ప్రచారం చెయ్యడం,



కరపత్రాలు పంచుతు, పోస్టర్లు వెయ్యడం, చెన్నూర్ 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ సత్యనారాయణ గార్కి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా ఉద్యోగులకు,కార్మికులకు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు, నిరుద్యోగ యువత, మహిళలు, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు, ఆటో, ట్రాక్టర్, లారీ, టాటా మ్యాజిక్, జీపులు, బిల్డింగ్ వర్కర్స్, వివిధ షాపుల్లో, షో రూం లాల్లో పని చేస్తున్నవారు, హామలీలు, ఇంటి పనివాళ్ళు, అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమ్మె, గ్రామీణ బంద్ లో పాల్గొనాలని పిలుపునివ్వడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో సామల ఉమ రాణి ఐద్వా మంచిర్యాల జిల్లా కార్యదర్శి,సిడం సమ్మక్క తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (TAGS) జిల్లా ఉపాధ్యక్షురాలు బోయిరే రమదేవి వృత్తిదారుల సంఘం చెన్నూర్ మండల నాయకురాలు,జడల యామిని ఐద్వా చెన్నూర్ పట్టణ నాయకురాలు.



# బుద్ధుని శాంతి మార్గమే మానవాళికి రక్ష

## భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్

వాంకిడి 12 మే ( క్రాంతి న్యూస్ ): బుద్ధుని శాంతి మార్గం ద్వారానే ప్రపంచ మానవాళి రక్షణ జరుగుతుందని భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మాహుల్కర్ అన్నారు. సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్ లో నిర్వహించిన 2568వ బుద్ధ జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రపంచ మానవాళికి తథాగత్ భగవాన్ గౌతమ్ బుద్ధుడు అందించిన ప్రజ్ఞ, శిల్,కరుణలాతోపాటు జీవహింస చేయకూడదని సందేశం మానవజాతికి ఎంతో ఉపయోగపడుతుందని తద్వారా మనిషి మనిషిని గుర్తించి సంస్కరించబడతార ని, అన్నారు. మానవజాతి అంతా సమానమని సమ సమానత్వాన్ని చాటిచెప్పిన తథాగతుడు మానవ సుఖమయ జీవితానికి బాటలు వేశారని వాటిని మనం గ్రహించి ముందుకు సాగాలని



ఆయన అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 19 56 అక్టోబర్ 14న భారతదేశంలో బౌద్ధ మతానికి పునర్జీవం పోసారని, ప్రపంచ జ్ఞాని ఆయన అంబేద్కర్ బాటలోనే దళితులంతా నడవాలని భారతీయ బౌద్ధమసభ జిల్లా కోశాధికారి, దుర్గం తిరుపతి అన్నారు. అనంతరం రామ్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధర్మాబాయి, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు జమాల్పురి సుధాకర్, బౌద్ధ ఉపాసకులు పాండు జాడేలు బుద్ధ జయంతిని పురస్కరించుకొని మాట్లాడారు.

ఘనంగా బుద్ధ జయంతి

వాంకిడి మండలంలో సోమవారం 2568వ బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జేత్వాన్ బుద్ధ విహార్, అంబేద్కర్ నగర్, కమన, కానార్గాం, లక్ష్మీ నగర్ గ్రామాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి మండల భారతీయ బౌద్ధమహా సభ అధ్యక్షులు జయరాం, అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, ఉపాధ్యక్షులు దుర్గం హంసరాజ్, ఎస్ ఎస్ డి ఇంచార్జ్ దుర్గం సందీప్ ,రమాబాయి,

మహిళా మండలి అధ్యక్షురాలు గంగుబాయి, బుద్ధ భూమి ట్రస్ట్ చైర్ పర్సన్ సరోజ, నాయకులు రోషన్ ఉప్రే, రామ్టెంకి ప్రతాప్, అరుణ్, రజిత్, మహేష్, జైపాల్, దుర్గం.చింటూ, బల్వంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.



## చేతులు, కాళ్ళలో నొప్పి ఉంటుందా..?
## వామ్మో.. ఈ వ్యాధులకు సంకేతం కావొచ్చు..

హెల్త్ న్యూస్ ,12 మే (క్రాంతి న్యూస్ ): వయసు పెరిగే కొద్దీ, తరచుగా చేతులు, కాళ్ళలో నొప్పి వస్తుంది. అయితే, మారిన జీవనశైలి, తీసుకునే ఆహారం కారణంగా.. ఈ సమస్య ఇప్పుడు యువతలో కూడా రావడం ప్రారంభమైంది. చేతులు - కాళ్ళలో నిరంతరం నొప్పి ఉండి, అది భరించలేనంతగా మారుతుంటే, అది అనేక వ్యాధుల లక్షణం కావచ్చు. చేతులు, కాళ్ళలో నొప్పిని సాధారణమైనదిగా భావించి, ఇంటి నివారణలను అనుసరించడం ద్వారా దానిని విస్మరించకూడదని.. ఇది క్రమంగా పెను ప్రమాదకరంగా మారవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే.. చేతులు, కాళ్ళలో నొప్పి ఎందుకు వస్తుంది..? అది ఏ వ్యాధులను సూచిస్తుంది..? నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను తెలుసుకోండి..

సాధారణంగా చేతులు, కాళ్ళలో నొప్పి సమస్య 50 సంవత్సరాల తర్వాత ప్రారంభమవుతుంది. ఈ సమస్య ఇంతకు ముందు వస్తుంటే మీరు మీ ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండాలి. చేతులు %-% కాళ్ళలో నొప్పి అనేక తీవ్రమైన వ్యాధుల లక్షణం.. వీటిలో, కొన్ని వ్యాధులు సాధారణం, కొన్ని తీవ్రమైనవి.. కొన్ని వ్యాధులు ఒకసారి వస్తే, అవి మీ జీవితాంతం మీతోనే ఉంటాయి. కాబట్టి, చేయి, వేలు, చీలమండ, మడమ, కాలు, బొటనవేలు మొదలైన వాటిలో నొప్పి ఉంటే దాన్ని వెంటనే తనిఖీ చేసుకునేందుకు వైద్యులను సంప్రదించండి..

ఈ వ్యాధుల లక్షణాలు ఇవే..

చేతులు, కాళ్ళలో నొప్పి మధుమేహం, ఆర్థరైటిస్, నాడీ వ్యవస్థ లోపాలు, రక్త ప్రవాహ సమస్యలు, విటమిన్ లోపం.. లక్షణం కూడా కావచ్చు. నొప్పికి కారణం పరీక్ష తర్వాతే తెలుస్తుంది. యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల చేతులు, కాళ్ల చిన్న కీళ్లలో నొప్పి వస్తుంది.



దీనిని నిర్లక్ష్యం చేస్తే ఈ తీవ్రమైన వ్యాధి ఆర్థరైటిస్‌గా మారుతుంది. వెరికోస్ వెయిన్స్ వల్ల కాళ్లలో వాపు, నొప్పి కూడా వస్తాయి. ఇది ఏ వయసులోనైనా జరగవచ్చు. కాబట్టి, నొప్పి ప్రారంభమైన వెంటనే పరీక్షించుకోవాలి. తద్వారా చికిత్సను ముందుగానే పూర్తి చేసి, రోగి తీవ్ర రూపం దాల్చకుండా నిరోధించవచ్చు.

30 ఏళ్ల తర్వాత వీటిని బంద్ చేయండి..

30 సంవత్సరాల వయస్సు తర్వాత, మధుమేహం, యూరిక్ యాసిడ్ కోసం పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోండి. సమతుల్య ఆహారంతో పాటు వ్యాయామం చేయండి. సోడా, శీతల పానీయాలతో పాటు మద్యం, పొగాకును నివారించండి. శరీరంలో విటమిన్ల లోపం ఉండనివ్వకండి. మిమ్మల్ని మీరు హైడ్రేటెడ్ గా ఉంచుకోండి.. కాలానుగుణ పండ్లు, కూరగాయలను తినండి.

## వేసవిలో డీలా పడకుండా ఈ డ్రింక్ తీసుకోండి

హెల్త్ న్యూస్ ,12 మే (క్రాంతి న్యూస్ ):వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరిచే పండ్లు, కూరగాయలూ తీసుకోవడం చాలా ముఖ్యం. అలాంటి వాటిలో కీరదోసకాయ రసం ముఖ్యమైనది. ఈ రసం తాగడం వల్ల శరీరానికి మంచిగా చలువ కలుగుతుంది. వేడి కారణంగా కలిగే అనేక సమస్యలకు ఇది ఉపశమనం ఇస్తుంది.



కీరదోసకాయ రసం తీసుకుంటే మన మెదడు చురుకుగా పని చేస్తుంది. మనసు ఏకాగ్రతగా మారుతుంది. జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. చదువు నేర్చుకునే విద్యార్థులు దీనిని తాగితే మంచి ఫలితం పొందగలరు. మొబైల్, టీవీ, పని ఒత్తిడి వల్ల ఆలోచనలు తారుమారవుతున్న ఈ రోజుల్లో ఇది సహాయపడుతుంది.

ఈ రసం మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఎప్పుడూ టెన్షన్‌తో ఉండే వ్యక్తులు కీరదోసకాయ రసం తాగితే మానసిక ప్రశాంతత పొందగలరు. ఇది శరీరాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది. నిద్ర కూడా బాగా వస్తుంది. రోజూ ఉదయాన్నే తీసుకుంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

కీరదోసకాయ రసంలో ఉండే పీచు, నీరు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. భోజనం తిన్న తర్వాత అజీర్ణం, కడుపు నొప్పి, కాన్స్టిపేషన్ వంటి సమస్యలుంటే దీనిని తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది. చిన్నపిల్లలకూ పెద్దలకూ కూడా ఇది ఉపయోగపడుతుంది.

ఈ రసం ఎముకల ఆరోగ్యానికి మంచిది. ఇందులో ఉన్న ఖనిజాలు ఎముకలను బలంగా ఉంచుతాయి. వయస్సు పెరిగేకొద్దీ ఎముకలు బలహీనమవుతుంటే కీరదోసకాయ రసం సహాయపడుతుంది. ఇది ప్రత్యేకంగా మహిళలకు ఉపయోగపడుతుంది.

ఈ రసం గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అధిక రక్తపోటు ఉన్నవారికి ఇది మంచిది. రక్త ప్రవాహాన్ని సరిచేస్తుంది. గుండెకు మేలు కలిగించే పోషకాలు ఇందులో ఉన్నాయి. ఇది గుండె సంబంధిత రుగ్మతల నివారణకు తోడ్పడుతుంది.

కీరదోసకాయ రసం కండరాలకు బలం ఇస్తుంది. వ్యాయామం చేసే వారు దీన్ని తాగితే శరీరానికి శక్తి లభిస్తుంది. శారీరక శ్రమ పెరిగినప్పుడు ఈ రసం తాగితే అలసట తగ్గుతుంది.

## పాలిష్ చేయబడిన బియ్యాన్ని తింటున్నారా..?

హెల్త్ న్యూస్ ,12 మే (క్రాంతి న్యూస్ ):ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి బియ్యమే ప్రధాన ఆహారంగా ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఆసియా దేశాల వారు బియ్యాన్ని అధికంగా తింటారు. అయితే బియ్యం పేరు చెబితే అందరికీ తెల్లగా పాలిష్ చేయబడిన బియ్యమే గుర్తుకు వస్తాయి. చాలా మంది బియ్యం తెల్లగా ఉంటే కానీ తినరు. బియ్యాన్ని యంత్రాల్లో అనేక మార్లు పాలిష్ చేసి మీద ఉండే పొట్టు చాలా వరకు పోయేలా చేస్తారు. దీంతో బియ్యం తెల్లగా మారి మెరుస్తుంది. అయితే వాస్తవానికి ఇలా పాలిష్ చేయబడిన బియ్యాన్ని తినడం మంచిది కాదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పూర్వ కాలంలో చాలా మంది దంపుడు బియ్యాన్నే తినేవారు. కానీ దాని స్థానంలో పాలిష్ బియ్యం వచ్చి చేరింది. ఇది అనేక దుష్పరిణామాలను కలిగిస్తుందని వారు అంటున్నారు.



జీర్ణ వ్యవస్థపై ప్రభావం..

పాలిష్ చేయబడిన బియ్యంలో ఫైబర్ ఉండదు. బియ్యంపై పొట్టును పూర్తిగా తొలగిస్తారు. కనుక ఫైబర్ కూడా పొట్టుతోపాటే పోతుంది. అలాంటి బియ్యాన్ని తింటే మనకు ఫైబర్ అసలు లభించదు. దీంతో పాలిష్ చేయబడిన బియ్యాన్ని తింటే జీర్ణ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా తిన్న అన్నం సరిగ్గా జీర్ణం కాదు. మలబద్దకం ఏర్పడుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను కలగజేస్తుంది. జీర్ణాశయం ఎల్లప్పుడూ నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. పొట్టలో అసౌకర్యం కూడా ఏర్పడుతుంది. పాలిష్ చేయబడిన బియ్యంలో బి విటమిన్లు ఉండవు. అనేక బి విటమిన్లతోపాటు ఐరన్, మెగ్నిషియం, జింక్ వంటి మినరల్స్‌ను కూడా కోల్పోతాం. అలాగే పాలిష్ చేయబడిన బియ్యంలో యాంటీ ఆక్సిడెంట్లు ఉండవు. బియ్యాన్ని పాలిష్ చేయడం వల్ల పొట్టులో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లను కూడా కోల్పోతాము.


రోగ నిరోధక వ్యవస్థపై..

పాలిష్ చేయబడిన బియ్యాన్ని తింటే అనేక పోషకాలు లభించవు. కనుక పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా విటమిన్ బి1, బి3లతోపాటు ఐరన్, జింక్ లోపం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. దీని వల్ల రోగ నిరోధక శక్తి సైతం తగ్గుతుంది. వ్యాధులు వచ్చే అవకాశం పెరుగుతుంది. కాబట్టి పాలిష్ చేయబడిన బియ్యం పరోక్షంగా రోగాలకు కారణమవుతుందని ఈ విషయం ద్వారా స్పష్టమవుతుంది. పాలిష్ చేయబడిన బియ్యం డయాబెటిస్ ఉన్నవారికి అసలు ఏమాత్రం మంచిది కాదు. ఈ బియ్యం గ్లైసీమిక్ ఇండెక్స్ (జీఐ) విలువ అధికంగా ఉంటుంది. దీన్ని అన్నంగా చేసి తింటే రక్తంలో షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. ఇది మధుమేహం ఉన్నవారికి కీడు చేస్తుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు పాలిష్ చేయబడిన బియ్యాన్ని ఎట్టి పరిస్థితిలోనూ తినకూడదు.


టాక్సిన్లు చేరుతాయి..

పాలిష్ చేయబడిన బియ్యాన్ని తింటే అధికంగా బరువు పెరుగుతారు. ఫైబర్ ఉండదు కనుక తిన్న అన్నం మొత్తం మన శరీరంలో కొవ్వుగా మారుతుంది. దీంతో బరువు పెరిగి టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంటుంది. ఇది గుండె జబ్బులకు కూడా దారి తీస్తుంది. పాలిష్ చేయబడిన బియ్యంలో ఆర్సెనిక్ స్థాయిలు అధికంగా ఉంటాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఇలాంటి బియ్యాన్ని తింటే శరీరంలో టాక్సిన్లు చేరుతాయి. ఇది క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను కలగజేస్తుంది. కనుక పాలిష్ చేయబడిన బియ్యాన్ని అసలు తినకూడదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆరోగ్యం కోసం బ్రౌన్ రైస్‌ను తినాలి. లేదా సింగిల్ పాలిష్ రైస్‌ను కూడా తినవచ్చు. దీంతో అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.

## మెదడు పనితీరును పెంచే ఫుడ్



హెల్త్ న్యూస్ ,12 మే (క్రాంతి న్యూస్ ):బ్రెయిన్ పవర్. మెదడు పనితీరును పెంచుకునేందుకు ఇప్పుడు చెప్పబోయే పదార్థాలు తీసుకుంటుంటే చాలు. అవేమిటో తెలుసుకుందాము.ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే చేపలు ,బ్లూబెర్రీస్‌లోని యాంటీఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. బ్రోకలీలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ కె ఉంటాయి.వాల్‌నట్స్‌లో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ మెదడుకు మంచివి. గుమ్మడికాయ గింజల్లో ఇనుము, జింక్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.డార్క్ చాక్లెట్ జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. సిట్రస్ పండ్లు



KR TV క్రాంతి
మంగళవారం 13 మే 2025
క్రీడలు
epaper.krtvnews.com



# టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన కింగ్ కోహ్లీ..



స్పోర్ట్స్ న్యూస్ ,12 మే (క్రాంతి న్యూస్ ): ఇంగ్లాడ్ పర్యటనకు ముందు క్రికెట్ అభిమానులకు బ్యాడ్ న్యూస్. స్టార్ క్రికెటర్, మాజీ సారథి విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికాడు. కెప్టెన్ రోహిత్ శర్మ బాటలోనే అతడు కూడా సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగభరిత పోస్ట్ పెట్టాడు. తాను కూడా టెస్టుల నుంచి రిటైరవ్వాలనుకుంటున్నట్లు ఇటీవల బీసీసీఐకి చెప్పిన కోహ్లీ.. తాజాగా దీనిపై అధికారిక ప్రకటన చేశాడు.

"14 ఏళ్ల క్రితం తొలిసారిగా టెస్టు క్రికెట్ జెర్సీ ధరించా. ఈ ఫార్మాట్ నన్ను ఇంత దూరం తీసుకెళ్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. ఇది నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి సరిపడా పాఠాలు నేర్పించింది. తెల్ల జెర్సీలో ఆడటం వ్యక్తిగతంగా నా మనసుకు చాలా ప్రత్యేకమైనది. నిశ్శబ్దమైన ఆనందం.. సుదీర్ఘమైన రోజులు.. ఎవరికీ కన్పించని చిన్న చిన్న క్షణాలు నాతో ఎప్పటికీ ఉంటాయి" "అలాంటి ఈ ఫార్మాట్ నుంచి దూరం జరగడం అంత తేలిక కాదు. కానీ, నా నిర్ణయం సరైనదే అనిపిస్తోంది. ఈ ఫార్మాట్ కోసం నేను ఎంతో ఇచ్చా. నేను ఆశించిన దానికంటే ఎక్కువే ఇది నాకు తిరిగిచ్చింది. మనసు నిండా సంతృప్తితో, కృతజ్ఞతాభావంతో దీని నుంచి వైదొలుగుతున్నా. వెనక్కి తిరిగి నా టెస్టు కెరీర్‌ను చూసుకుంటే నా ముఖంలో చిరునవ్వు కన్పిస్తుంది. ప్రేమతో ఇక సైనింగ్ ఆఫ్.." అని కోహ్లీ తన పోస్టులో రాసుకొచ్చాడు.

కాగా.. గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం రోహిత్ శర్మ, కోహ్లీ ఒకేసారి పొట్టి క్రికెట్‌కు టాటా చెప్పారు. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం రోహిత్ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అభిమానులకు షాకిచ్చాడు. అతడు వైదొలగడంతో ఇంగ్లాండ్ పర్యటనకు కోహ్లీ అత్యంత కీలకమవుతాడని అంతా భావించారు. అంతలోనే తాను కూడా రిటైర్ అవ్వాలనుకుంటున్నానని విరాట్ బీసీసీఐకి సమాచారమిచ్చాడు. దీంతో అతడికి సర్దిచెప్పేందుకు బోర్డు ప్రయత్నించింది. కానీ, కోహ్లీ మాత్రం తన టెస్టు కెరీర్‌ను ముగించేందుకే సుముఖత చూపించాడు.

2011 మధ్యలో టెస్టు క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కోహ్లీ.. ఇప్పటివరకు 123 టెస్టులు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 శతకాలు, 31 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ ఫార్మాట్‌లో విరాట్ వ్యక్తిగత అత్యధిక స్కోరు 254 పరుగులు. 2025 జనవరి 3న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడాడు. టెస్టుల్లో ఎన్నో గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన విరాట్.. పదివేల పరుగుల మైలురాయికి కొద్ది దూరంలోనే నిలిచి.. ఈ ఫార్మాట్

## మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టిన గుజరాత్ టైటాన్స్..!



స్పోర్ట్స్ న్యూస్ ,12 మే (క్రాంతి న్యూస్ ): భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ అవగాహన నేపథ్యంలో గుజరాత్ టైటాన్స్ జట్టు శిక్షణను ప్రారంభించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిస్థితులు ఉద్రిక్తత మారిన నేపథ్యంలో ఐపీఎల్ పరిపాలన టోర్నీని వారం పాయిటు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరిస్థితులు సద్దుమణుగుతున్న నేపథ్యంలో టోర్నీ పునః ప్రారంభంపై చర్చలు జరిగాయి. ఈ నెల 16న లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానున్నంది. ఇక గుజరాత్ జట్టు ఇంకా మూడు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఢిల్లీ, ముంబయి, చెన్నైతో కీలక మ్యాచులున్నాయి. ఈ మూడు మ్యాచుల్లోనూ రాణించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలువాలని ఆశిస్తున్నది. గుజరాత్ ఇప్పటి వరకు ఆడిన 11 మ్యాచుల్లో ఎనిమిదింట్లో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఈ క్రమంలో అదే ఊపుతో మరోసారి చాంపియన్‌గా నిలువాలని భావిస్తుంది.

గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ ఆటగాళ్లకు మూడు గంటలకుపైగా జట్టు ప్రాక్టీస్‌లో పాల్గొన్నట్లు తెలిపింది. సస్పెన్షన్ కారణంగా సీజన్‌లో కొన్ని మ్యాచులకు దూరమైన కగిసో రబాడ మళ్లీ జట్టుతో చేరాడు. రూథర్‌ఫోర్డ్, మహమ్మద్ సిరాజ్, కెప్టెన్ గిల్‌తో కలిసి నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. ఇదిలా ఉండగా.. ఈ నెల 8న పంజాబ్ కింగ్స్–ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ అర్ధాంతరంగా ముగిసిన విషయం తెలిసిందే. అయితే, ఈ మ్యాచ్ స్టేటస్‌ని బీసీసీఐ ఇప్పటి వరకు ప్రకటించలేదు. ఇరు జట్లకు ఎలాంటి పాయింట్లు కేటాయించలేదు. మ్యాచ్ తిరిగి ప్రారంభమైతే.. మళ్లీ నిర్వహిస్తారా? లేదంటే చెరో పాయింట్‌ను కేటాయిస్తారా? అన్నది తెలియలేదు. టోర్నీని లక్నో సూపర్ జెయింట్స్–రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తోనే మొదలుపెట్టనున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రెండు జట్లకు చెరో పాయింట్ ఇచ్చే అవకాశాలున్నాయి. బీసీసీఐ మళ్లీ షెడ్యూల్‌ని సవరించిన సమయంలో ఈ విషయంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## టెస్ట్ కెప్టెన్సీ రేసు నుంచి తప్పుకున్న జస్ప్రీత్ బుమ్రా..!



స్పోర్ట్స్ న్యూస్ ,12 మే (క్రాంతి న్యూస్ ): టెస్టులకు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో కొత్త సారథి ఎవరు ? అన్న చర్చ సాగుతున్నది. వచ్చే నెల నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో టీమిండియా పాల్గొనున్నది. ఈ పర్యటన కోసం బీసీసీఐ ఈ నెలలోనే జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. కొత్త కెప్టెన్ ఎవరనే దానిపై ఇప్పటి వరకు ఓ స్పష్టత రాలేదని తెలుస్తున్నది. కెప్టెన్ రేసులో యువ బ్యాట్స్‌మెన్ శుభ్‌మన్ గిల్, స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్, ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మధ్య విపరీతమైన పోటీ ఉన్నది. అయితే, టెస్ట్ కెప్టెన్సీ రేసు నుంచి బుమ్రా తప్పుకున్నట్టు ఓ మీడియా నివేదిక తెలిపింది.

ఇక కెప్టెన్సీ రేసు గిల్–పంత్ మధ్యనే ఉందని పేర్కొంది. టెస్ట్ కెప్టెన్సీ బుమ్రా పేరు సైతం గట్టిగానే వినిపించింది. కానీ, పనిభారం కారణంగా ఐదు మ్యాచుల సుదీర్ఘ టెస్ట్ సిరీస్‌లోని అన్ని మ్యాచులు ఆడుతానని హామీ ఇవ్వలేనని సెలెక్టర్లకు చెప్పాడని ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్ తెలిపింది. ఈ పరిస్థితిలో సెలెక్టర్లు సిరీస్ అంతా నిలకడగా రాణించే ఆటగాడికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పింది. బుమ్రా స్వయంగా కెప్టెన్సీ రేసు నుంచి తప్పుకోవడంతో సెలెక్టర్లు ప్రసుతం శుభ్‌మన్ గిల్, పంత్‌లో ఎవరైనా ఒకరిని కెప్టెన్సీకి ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఇద్దరిలో ఎవరో ఒకరు కెప్టెన్ అయినా.. మరొకరిని వైస్ కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ సిరీస్ కోసం భారత జట్టును ఈ నెల 24లోగా ప్రకటించే అవకాశం ఉంది.

## మిచెల్ స్టార్క్ ఐపీఎల్‌కు తిరిగివచ్చేది అనుమానమే!

స్పోర్ట్స్ న్యూస్ ,12 మే (క్రాంతి న్యూస్ ): ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్, ఆస్ట్రేలియన్ క్రికెటర్ మిచెల్ స్టార్క్ ఐపీఎల్ 2025లో తిరిగి ఆడేది అనుమానమే. భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ కొన్ని రోజుల పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ టోర్నీకి సంబంధించిన మ్యాచ్‌లు తిరిగి మే 16 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఫైనల్ పోరు మే 25 బదులుగా మే 30న జరగనున్నట్లు సమాచారం.



కానీ.. మిచెల్ స్టార్క్ ఇప్పటికే సిడ్నీ చేరుకున్నాడు. ఐపీఎల్‌లో తిరిగి ఆడే విషయంపై లోకల్ మీడియాతో మాట్లాడేందుకు అతడు నిరాకరించాడు. బహుశా స్టార్క్ తిరిగి ఐపీఎల్ 2025లో పాల్గొనలేకపోవచ్చని మిచెల్ మేనేజర్ తర్వాత మీడియాతో అన్నారు. అలాగే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న పాట్ కమిన్స్ , ట్రావిస్ హెడ్ కూడా రాకపోవచ్చని సమాచారం. జూన్ 11 నుంచి లార్డ్స్ మైదానంలో జరగనున్న ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ నేపథ్యంలో వారు ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. న్యూజిలాండ్ ఆటగాళ్లలో కూడా చాలామంది ఇప్పటికే స్వదేశం చేరుకున్నారు. దక్షిణాఫ్రికా ఆటగాళ్ల విషయంలోనూ ఇంకా అనిశ్చితి నెలకొని ఉంది.

ఐపీఎల్ వాయిదా.. మంచి రిథమ్‌లో కనిపించిన ఆర్సీబీ వంటి జట్లకు కాస్త ఇబ్బందిని తెచ్చిపెట్టింది. కానీ కెప్టెన్ రజత్ పటీదార్‌కు మాత్రం కాస్త ఊరట కలిగించిందనే చెప్పొచ్చు. చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు అతడి చేతి వేలికి గాయమైంది. ఐపీఎల్‌లో ప్రస్తుత విరామం అతడు తిరిగి కోలుకుని, మ్యాచుల్లో పాల్గొనే అవకాశాన్ని ఇచ్చింది. ఈలోగా ఫిట్‌నెస్ సాధించి ప్లేఆఫ్స్‌లో పాల్గొనాలని రజత్ పటీదార్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే అతడు త్వరలో జరగనున్న ఇంగ్లాండ్ టూర్‌లో భాగంగా భారత్– ఎ తరఫున కూడా పాల్గొనాల్సి ఉంది.

## విఘ్నేశ్ శివన్ కొత్త చిత్రం



నటి నయనతార భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'ఎల్ఐకే' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ). ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి హీరోహీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 2023లో పట్టాలెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా చిత్రబృందం రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబర్ 18న దీనిని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపింది. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు సమాచారం. అనిరుధ్ స్వరాలు అందిస్తున్నారు.

**వివాదాలు ఎదుర్కొని..!**

ఈ సినిమా విషయంలో విఘ్నేశ్ శివన్ పలు వివాదాలు ఎదుర్కొన్నారు. తొలుత ఈ చిత్రాన్ని నటుడు శివకార్తికేయన్‌తో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై చేస్తున్నట్లు 2019లో వార్తలు వచ్చాయి. అనివార్య కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలోనే 2023లో ప్రదీప్ రంగనాథన్ హీరోగా విఘ్నేశ్ శివన్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. మొదట ఈ చిత్రానికి 'ఎల్ఐసీ' (లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్)అనే టైటిల్ పెట్టారు. దీంతో ఎల్ఐసీ సంస్థ చిత్రబృందానికి నోటీసులు జారీ చేసింది. తమ సంస్థకు ప్రజల్లో మంచి పేరు ఉందని.. సినిమా కోసం ఈ టైటిల్‌ను ఉపయోగిస్తే సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగే అవకాశం ఉందని పేర్కొంది. వారం రోజుల్లోగా పేరు మార్చకపోతే లీగల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈనేపథ్యంలోనే తమ సినిమా టైటిల్‌ను 'ఎల్ఐసీ' నుంచి 'ఎల్ఐకే'గా మార్చారు. ప్రస్తుతం ఇది సెవెన్ స్క్రీన్ స్టూడియో పతాకంపై నిర్మితమవుతోంది.

## విశాల్ ఆరోగ్యంపై స్పందించిన టీమ్



నటుడు విశాల్ ఆదివారం విల్లుపురంలో జరిగిన మిస్ కూవగం 2025 కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఒక్కసారిగా వేదికపై కుప్పకూలిపోయిన విషయం తెలిసిందే. దీనితో ఆయన ఆరోగ్యంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. అయితే, విశాల్ టీమ్ తాజాగా ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టతనిచ్చింది. విశాల్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆయన ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బ లేదా అలసట కారణంగా ఆయన అస్వస్థతకు గురయ్యారని ప్రాథమికంగా భావిస్తున్నారు. వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్య సమాచారం తెలియజేస్తామని వారు పేర్కొన్నారు. కాగా, విశాల్ త్వరగా కోలుకోవాలని అభిమానులు మరియు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షిస్తున్నారు. కొన్ని నెలల క్రితం డెంగ్యూ నుండి కోలుకున్న విశాల్ మళ్లీ అస్వస్థతకు గురికావడం అభిమానులను ఆందోళనకు గురిచేసింది. అయితే, ఆయన టీమ్ క్లారిటీ ఇవ్వడంతో అభిమానులంతా ఊపిరి పీల్చుకున్నారు.



## బాలీవుడ్‌లో మరొకటి?

తెరపై సహజమైన నటనతో.. అదిరిపోయే స్టెప్పులతో కుర్రకారుని ఉర్రూతలూగించే కథానాయిక శ్రీలీల .. బాలీవుడ్‌లో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో హిందీ ప్రాజెక్టుకు ఓకే చెప్పినట్లు సమాచారం. విక్రాంత్ మాస్సే, లక్ష్య ప్రధాన పాత్రల్లో 'దోస్తానా 2' రూపొందుతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. కరణ్ జోహార్ నిర్మాత. ఇప్పుడీ చిత్రంలో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దీని గురించి ఆమెతో చర్చలు చేస్తున్నారని.. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం శ్రీలీల జాబితాలో 'మాస్ జాతర', 'పరాశక్తి' తదితర చిత్రాలు ఉన్నాయి.




## కన్నన్ కౌంట్‌డౌన్ షురూ

పాత్ర ఏదైనా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా పెట్టుకునే కథానాయకుల్లో విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ఒకరు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఏసీఈ'. రుక్మిణీ వసంత్ ఈ సినిమాతోనే తమిళంలోకి అడుగుపెట్టడం విశేషం. ఆరుముగ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈనెల 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే "ఏసీఈ' కౌంట్‌డౌన్ మొదలు" అనే వ్యాఖ్యతో ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో బోల్డ్ కన్నన్ అనే పాత్రలో కనిపించనున్నారు విజయ్. యాక్షన్ సీక్వెన్స్, ఆకట్టుకునే సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్‌తో.. సినిమాని దోపిడీ, జూదం నేపథ్యంలో తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. యోగి బాబు కీలక పాత్ర పోషించారు. 7సీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాను నిర్మించింది.

## 20 ఏండ్లు పూర్తి చేసుకున్న రవితేజ 'భద్ర'

మాస్ మహారాజ రవితేజ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రాలలో భద్ర ఒకటి. ఈ చిత్రం విడుదలై నేటికి సరిగ్గా 20 ఏళ్లు పూర్తయింది. 2005 మే 12న విడుదలైన ఈ సినిమా మాస్ మహారాజా రవితేజ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచింది.

బోయపాటి శ్రీను ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవ్వగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. ఈ సినిమాలో రవితేజ సరసన మీరా జాస్మిన్ హీరోయిన్‌గా నటించగా, ప్రకాష్ రాజ్, సునీల్, అర్జున్ బజ్వా వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషించారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన సంగీతం ఈ సినిమాకు హైలైట్‌గా నిలిచిందని చెప్పవచ్చు. ముఖ్యంగా "తిరుమల వాసా", "ఓ మనసా" వంటి పాటలు అయితే ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తునే ఉన్నాయి.




'భద్ర' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేయడమే కాకుండా, రవితేజకు మాస్ ప్రేక్షకుల్లో మరింత గుర్తింపు తెచ్చిపెట్టింది. ఫ్యాక్షన్ నేపథ్యంలో ప్రేమకథను జోడించి బోయపాటి శ్రీను తనదైన శైలిలో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా రవితేజ అభిమానులకు ఎప్పటికీ ఒక ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిపోతుంది.

అయితే ఈ చిత్రం 20 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'భద్ర' చిత్ర బృందానికి మరియు రవితేజకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సోషల్ మీడియాలో ఈ సినిమా గురించిన జ్ఞాపకాలు, విశేషాలు వైరల్ అవుతున్నాయి.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com